

మూడు జిల్లాలకు నూతన కలెక్టర్లు



డాక్టర్ వినోద్‌కుమార్ కలెక్టర్, బాపట్ల జిల్లా



కృతికా శుక్లా కలెక్టర్, పల్నాడు జిల్లా



తమీమ్ అన్సారియా కలెక్టర్, గుంటూరు జిల్లా

- గుంటూరు, బాపట్ల, పల్నాడు కలెక్టర్ల బదిలీ
- నాగలక్ష్మి స్థానంలో తమీమ్ అన్సారియా
- వెంకటమురళిని మార్చి వినోద్‌కుమార్‌కు పోస్టింగ్
- అరుణ్‌బాబును బదిలీ చేసి కృతికాశుక్లా నియామకం
- మానవీయ కోణంలో పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆశలు నెరవేర్చాలన్న చంద్రబాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఒకే సారి బదిలీ అయ్యారు. సుదీర్ఘ కసరత్తు అనంతరం గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు చీఫ్ సెక్రటరి విజయానంద్ కలెక్టర్ల బదిలీలకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రకారం గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్థానంలో తమీమ్‌అన్సారియా నియమితులయ్యారు. బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళిని మార్చి డాక్టర్ వినోద్‌కు మార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును బదిలీ చేసి కృతికాశుక్లా నియమించారు. నాగలక్ష్మి, వెంకటమురళి, అరుణ్‌బాబులకు ప్రభుత్వం పోస్టింగ్ చేయలేదు. నూతన కలెక్టర్లు త్వరలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు కలెక్టరేట్ వర్గాల సమాచారం. కాగా నూతన కలెక్టర్ల పోస్టింగ్ అనంతరం సీఎం చంద్రబాబు తన క్యాంపు కార్యాలయంలో గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో (మిగతా 8లో)

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చెట్లతోపాటు జంతువులను కాపాడుకోవాలి

అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కాంతిలాల్‌దండే



అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కాంతిలాల్‌దండే, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కాంతిలాల్‌దండే తెలిపారు. అటవీశాఖా ఆధ్వర్యంలో గురువారం జాతీయ అటవిశాఖ అమరవీరుల సంస్మరణ దినం స్థానిక సూర్యలంకతీరంలోని నగరవనంలో జరిగింది. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, అటవీశాఖ సలహాదారులు మల్లికార్జున తదితరులతో కలిసి కాంతిలాల్‌దండే నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కాంతిలాల్ దండే మాట్లాడుతూ చెట్లతోపాటు జంతువులను కాపాడుకోవాలని సూచించారు. అటవీభూముల ప్రాధాన్యతను గుర్తించి రక్షించాలని చెప్పారు. విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అటవీశాఖ అండగా ఉండాలన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తాను తెలంగాణలో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న సమయంలో తన మిత్రుడు అటవీశాఖ ఉద్యోగం చేస్తూ నక్సల్స్ చేతిలో మరణించాడని తెలిపారు. ఇలాంటి వారి సేవలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ కొందరు అజ్ఞానంతో చెట్లను నరికివేయడంతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. వరదలతో పాటు కరువు కాటకాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో చెట్టు సంరక్షనతో పాటు అడవులను కాపాడటాన్ని ప్రతీఒక్కరూ తమ జీవనంలో ఓ భాగం చేసుకో వాలని తెలిపారు. అటవీశాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన 8 కుటుంబాలకు చెందిన సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖాధికారులు పీడీ చలపతి, రాహుల్‌పాండే, శాంతిప్రియపాండే, శరవణన్, ఐకేవీ రాజు, చైతన్యకుమార్‌రెడ్డి, కె.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటోవాలా.. ఆనంద హేల

'ఆటో మిత్ర'తో ఆటో డ్రైవర్లకు చేయూత

స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ అయింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే మహిళల సంఖ్య భారీగా పెరిగింది. ఇదే సమయంలో ఎంతో కొంత ఆటోల నిర్వాహకులు నష్టపోతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయాత అందించేందుకు ఆటో మిత్ర పథకం అమలు చేయబోతోంది. ఆటోవాలాకు ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. దసరా నుంచి పథకం అమలు అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభలో చేసిన ప్రకటనతో ఆటో వాలాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు అరకొరగా చెల్లించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 28 వేల ఆటోలు ఉంటాయని రవాణా శాఖ అంచనా. వేలాది మంది ఆటో డ్రైవర్లకు సుమారు రూ.42 కోట్ల లబ్ధి చేకూరనుంది.



- దసరా నుంచి అమలుకు కసరత్తు
- ఏటా రూ.15,000 ఇస్తామంటూ ప్రభుత్వం వెల్లడి
- 28 వేల మందికిపైగా.. రూ.42 కోట్ల లబ్ధి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆటో మిత్ర పథకం అమలుకు జిల్లాలో రవాణా శాఖ కసరత్తు ప్రారంభించింది. గతంలో ఆటో, మాక్సీ మ్యాజిక్ క్యాబ్‌లకు వాహన మిత్ర పథకం అమలు చేశారు. ఈ సారి అచ్చంగా ఆటోలు నడిపే వారికేనా లేక క్యాబ్‌లకు కూడా ఈ పథకం అమలు చేస్తారా అన్న అంశం ప్రభుత్వ మార్గదర్శకాల్లో తేల నుంది. కొన్ని పట్టణాల్లో ఆర్టీసీ సిటీ సర్వీసులు లేవు. దీనివల్ల పట్టణాల్లో ఆటో వాలలకు నష్టం నామ మాత్రమే. అయితే గ్రామాల నుంచి మహిళలు ఆ టోల్లోనే ప్రయాణించే వారు. ఉచిత ప్రయాణంతో వీ రందరూ ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గ్రామీణ ఆటోడ్రైవర్లు నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

ఆటో డ్రైవర్లకే ఆర్థిక సాయం ఇవ్వండి

హరిత పన్ను తగ్గింపుతో.. ప్రభుత్వం ఆటో వాలలకు ఆర్థిక భారం తగ్గించిన విషయం తెలిసిందే. మేలో హరిత పన్ను విధానం అమలు చేసిన ప్రభుత్వం.. దసరాకు ఆటో మిత్ర పథకం అమలు చేస్తూ ఆటో వాలాలకు డబుల్ ధమాకా అందిస్తోంది. అయితే రోజూ ఆటో నడిపే డ్రైవర్లకు పథకం వర్తింపజేయాలని డ్రైవర్లు కోరుతున్నారు. రోజు వారీ అద్దెకు ఆటోలు నడుపుతుంటామని అయితే ఆటో ఓనర్లకు కాకుండా డ్రైవర్లకు ఆటో మిత్ర అమలు చేయాలంటున్నారు. ఆటో మిత్ర పథకం ప్రకటనపై కూటమి ప్రభుత్వంకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఆటోవాలాలకు ఎంతో మేలు



ఆటో మిత్ర పథకం ప్రకటించిన సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో.. రోజు వారి ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 నుంచి 30 శాతం తగ్గింది. అంతకు ముందు రోజు రూ.700 నుంచి రూ.1000 బాడిగ తోలేవాళ్లం. ఇప్పుడు రూ.500 నుంచి రూ.700కు ఆదాయం తగ్గింది.

-ఏడుకొండలు, ఆటో డ్రైవర్, నరసరావుపేట

ఆటో మిత్ర ఆదుకుంటుంది



మహిళలకు ఉచిత ప్రయాణంతో కొంత మేర ఆదాయం కోల్పోయాం. ప్రభుత్వం దసరా నుంచి ఆటో మిత్ర ద్వారా ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తే.. ఆర్థికంగా మేలు చేసినట్లే. ఆటో డ్రైవర్లకు చేయూత నందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-చౌడయ్య, డ్రైవర్, రూపెనగుంట్ల



సూర్యలంక సముద్రతీరంలో బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

సంబరాలను విజయవంతం చేయాలి

● బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలనలో ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంక సముద్ర తీరంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే బీచ్‌ఫెస్టివల్ సంబరాలను సమన్వయంతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులకు తెలిపారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. బీచ్ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తీరంలో రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రహదారికి ఇరువైపులా చిల్లచెట్లను తొలగించాలన్నారు. ఎమ్మెల్యే వెంట అడవిగ్రామపంచాయతీ స్పెషలాఫీసర్, తహసీల్దార్ షేక్.సలీమా, సర్వేయర్ లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

బస్సులో 5 కిలోలు గంజాయి స్వాధీనం

● ఒకర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ● బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఘటన

మార్టూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండల పరిధిలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఆర్టీసీ బస్సులో 5 కిలోలు గంజాయిని గురువారం తెల్లవారుజామున ఎస్‌టీఎఫ్ ఎన్ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషాకి చెందిన సురేష్ మహాపాత్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిషా నుంచి చెన్నైకు గంజాయి తరలిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాలు మేరకు ప్రకాశం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విజయ పర్యవేక్షణలో టోల్‌ప్లాజా వద్ద గుంటూరు వైపు నుండి ఒంగోలు వైపు వెళ్లే వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో విశాఖ నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నఅనుమానితుడిగా కనిపించిన సురేష్‌మహాపాత్రను తనిఖీ చేయగా బ్యాగ్‌లో 5 కిలోలు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఒడిషాలోని సమీప బంధువు విశాల్‌బుట్కీ దగ్గర కిలో రూ.3వేలు వంతున 5కిలోలు గంజాయిని కొనుగోలు చేసి చెన్నైలో కిలో 10వేలకు విక్రయిస్తున్నట్లు అధికారుల విచారణలో సురేష్ చెప్పినట్లు సమాచారం. ఇతడిపై చెన్నైలో గతంలో రెండు కేసులు ఉండగా జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఈఎస్ మధుబాబు, ఏఈ ఎస్ జనార్ధన్, సీఐలు నరహరిరావు,రామారావు, ఎస్ఐ శ్రీధర్,ఎస్‌టీఎఫ్ సీఐ బాలనరసింహ పాల్గొన్నారు.



బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద 5 కిలోల గంజాయి సహా నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న అధికారులు

గడువు.. మూడు రోజులే

- బార్ల దరఖాస్తులకు స్పందన అంతంతే
- మూడు జిల్లాల్లో 112 బార్లకు 15 దరఖాస్తులు
- 14 వరకే అవకాశం.. శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు
- అధికారులు వేడుకుంటున్నా ముందుకురాని మద్యం వ్యాపారులు
- ఎక్సైజ్ అధికారుల గుండెల్లో రైళ్లు.. అన్ని మార్గాల్లో ప్రయత్నాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం బార్ల నిర్వహణకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. తొలివిడతలో రెండు సార్లు అవకాశం ఇవ్వగా దరఖాస్తులు స్పందన కానరాలేదు. దీంతో రెండో విడతలో ఈ నెల 3న గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 112 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చింది. వీటికి ఆదివారం వరకు గడువు ఇచ్చింది. రీనోటిఫికేషన్ గడువు ఇక మూడు రోజులు మాత్రమే ఉంది. ఇందులో శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవు. అయితే ఇంతవరకు దరఖాస్తులు వేసేందుకు వ్యాపా రులు ముందుకు రాలేదు. బాపట్ల జిల్లాలో 15 బార్లకు రీ నోటిఫికేషన్ ఇవ్వగా గురువారానికి కేవలం ఐదు దరఖాస్తులే వచ్చినట్లు సమాచారం. కేవలం మూడు రోజులు మాత్రమే మలివిడత నోటిఫికేషన్‌లో గడువు మిగిలి ఉన్నా వ్యాపారులు దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపకపోవడంపై అధికారులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో 67 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా ఎనిమిది, పల్నాడు (మిగతా 6లో)



గేదెల కొనుగోళ్లపై భిన్న ఆదేశాలు

- సెర్ప్ సీఈవో ప్రకటనకు భిన్నంగా స్థానిక అధికారులు
- ఆందోళనలో పొదుపు మహిళలు.. మంత్రి దృష్టికి సమస్య

బల్లికురవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గేదెల యూనిట్లపై సెర్ప్ అధికారులు విభిన్నంగా ఆదేశాలు ఇస్తున్నారు. లబ్ధిదారులైన మహిళల అభీష్టం మేరకు స్థానికంగానే కొనుగోలుకు సెర్ప్ సీఈవో ఆమోదించగా అందుకు పూర్తి భిన్నంగా తాము చెప్పిన దగ్గరే కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు చెప్తున్నారు. తమ ఇబ్బందులను జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల గేదెలను మాత్రమే కొనుగోలు చేయాలని అధికారుల మెలికతో పొదుపు సంఘాల మహిళలు ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర సెర్ప్ సీఈవో వాకాటి కరుణ పొదుపు సంఘాల గ్రామ సంఘాల అధ్యక్షులతో ఆన్‌లైన్‌లో నిర్వహించిన సమావేశంలో గేదెల ప్రస్తావన రాగా స్థానికంగా కొనుగోలుకు ఆమె ఆమోదించారు. బ్యాంకు రుణం ద్వారానే గేదెలు కొనుగోలు చేయిస్తున్నాం.. ఇందులో ఎలాంటి సబ్సిడీ లేదు.. వారు ఎక్కడ ఇష్టపడితే అక్కడే కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. తాము గేదెలు ఎక్కడైన కొనుగోలు చేసుకోవచ్చని మహిళలు ఆనందపడ్డారు. సమావేశం అనంతరం జిల్లా అధికారులు మళ్లీ సమావేశమై కృష్ణ జిల్లాలోని ఫారాల్లోని గేదెలను మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పొదుపు సంఘాల మహిళలు రాష్ట్ర స్థాయి అధికారులు కరుణించినా జిల్లా అధికారులు తమ బాధను అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల గేదెలు వాతావరణం ప్రభావంతో ఇక్కడకు తీసుకు రాగానే పాలు ఇవ్వడం లేదని మహిళలు అంటున్నారు. ఈ విషయమై మంత్రి రవికుమార్‌ను కలిసి సమస్యను విన్నవించేందుకు పొదుపు సంఘాల మహిళలు సిద్ధమవుతున్నారు.

6 ఉమ్మడి గుంటూరు జిల్లాకు.. 2,640 మెట్రిక్ టన్నుల యూరియా

నైపుణ్యాల పెంపుతో.. పోటీ ప్రపంచంలో రాణించాలి
ఏఎన్‌యూ 49వ వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ ఆచార్య గంగాధరరావు

తురకపాలెం మరణాలపై.. కొనసాగుతున్న అధ్యయనం: కలెక్టర్ 8

నిధుల కేటాయింపుల్లో జడ్పీటీసీలకే మొదటి ప్రాధాన్యం

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా


ఒకటవ స్థాయి సంఘ సమావేశంలో జడ్పీ చైర్‌పరన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ నిధుల కేటాయింపులో జడ్పీటీసీ సభ్యులకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా స్పష్టం చేశారు. జడ్పీటీసీలు అడిగిన పనులకు నిధులు కేటాయించిన తర్వాతే మిగిలిన వారికి ఇస్తున్నామని పేర్కొన్నారు. గురువారం జడ్పీ కార్యాలయంలో 1, 2, 3, 4, 5, 6, 7 స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించారు. 3వ స్థాయి సంఘం మినహా, మిగిలిన అన్ని సంఘాలకు కోరం సరిపోయింది. ఒకటవ స్థాయి సంఘం సమావేశంలో నిధుల కేటాయింపు వ్యవహారంపై చర్చ జరిగింది. నరసరావుపేట జడ్పీటీసీ చిట్టిబాబు మాట్లాడుతూ.. ఏడాది క్రితం ప్రతి పాదించిన పనులను ఇంత వరకు అజెండాలో చేర్చలేదని అసహనం వ్యక్తం చేశారు. నరసరావుపేటకు గతంలోనే రూ. 4 కోట్లు కేటాయించిన విషయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. జడ్పీటీసీ సభ్యుల ప్రతిపాదనలను తన కార్యాలయం నుంచి అధికారులకు ఎప్పుడో పంపానని వెల్లడించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జడ్పీటీసీలు ప్రతిపాదించిన పనులకు ప్రాధాన్యం ఇస్తామని చైర్‌పర్సన్, సీఈఓ హామీ ఇచ్చారు. నాదెండ్ల జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో నిర్వహించిన వేలం పాటను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని కోరారు... అందుకు నిబంధనలు ఒప్పుకోవని సీఈఓ స్పష్టం చేశారు. ఆయా శాఖల జిల్లా అధికారులు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు.

రీ-సర్వే పరిశీలనలో 70 మంది సివిల్ జడ్జిల బృందం


రీసర్వే తీరును జడ్జిలకు వివరిస్తున్న సర్వేయర్లు

దుగ్గిరాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల ద్వారా తీసిన చిత్రాలను సరిచేసి.. భూమి వాస్తవ రూపానికి అనుగుణంగా మార్చిన చిత్రాలు (ఓఆర్ఐ) సర్వేలో ఉపయోగ పడతాయని తెనాలి డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ పార్థసారథి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు చెందిన 70 మంది సివిల్ జడ్జిల బృందం భూ-సర్వే జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు మండలంలోని తుమ్మపూడి గ్రామానికి గురువారం చేరుకుంది. తెనాలి - విజయవాడ మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఓ పొలంలో సర్వే సిబ్బంది తమ వద్దనున్న సర్వే ఉపరణాల ద్వారా భూ-రీసర్వే గురించి వివరించారు. వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్, వీఏఓల బృందం సర్వే చేసిన అనంతరం గ్రౌండ్ ట్రూతింగ్, గ్రామ సరిహద్దుల నిర్ణయం, ప్రభుత్వ భూములకు సంబంధించి పాయింట్లను గుర్తించి సర్వే రాళ్లను ఏర్పాటు చేయడం, ప్రస్తుతం భూమి మీదున్న రైతులు, వారి భూమి విలువ, అడంగల్‌లో నమోదు చేయడాన్ని వివరించారు. సర్వే పూర్తయ్యాక యజమానికి 9-2 నోటీసులు అందించి, తప్పులు ఉంటే వాటిని సరిచేయడం, ఎల్‌పీఎం జారీ విధానం గురించి తెలియజేశారు. ఒక ఎకరం పొలం కలిగి ఉంటే.. ఇద్దరికీ సమానంగా ఏ విధంగా విభజించాలో, క్రయవిక్రయాల సమయంలో ఆన్‌లైన్ సబ్ డివిజన్ చేయాలో తదితర అంశాలను సివిల్ న్యాయమూర్తుల బృందానికి వివరించారు. దుగ్గిరాల, తాడేపల్లి, పెదకాకాని మండల సర్వేయర్లు గోపాలరావు, రవితేజ, వీరాంజనేయులు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల..

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు



గుంటూరు సర్కిల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఎండీ పుల్లారెడ్డి, డైరక్టర్ మురళీకృష్ణయాదవ్ తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని అడవి తక్కెళ్ళపాడు సబ్‌స్టేషన్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన విద్యుత్‌శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. రాష్ట్రంలోని మూడు డిస్కంలతో పాటు ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో లోని టీంలు టెన్నిస్, బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జేకేసీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడంతో మానసిక ఉల్లాసంతో పాటు.. శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. టెన్నిస్‌లో గుంటూరు ఆపరేషన్ సర్కిల్‌కు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి నెల్లూరు ఆపరేషన్ సర్కిల్, తృతీయ బహుమతి విద్యుత్ సౌధ (విజయవాడ) ఉద్యోగుల జట్లు నిలిచినట్లు తెలిపారు. బాస్కెట్ బాల్ పోటీల్లో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజక్ట్ మొదటి బహుమతి, రెండో బహుమతి ఎన్‌టీపీసీ (విజయవాడ), మూడో బహుమతి గుంటూరు ఆపరేషన్ సర్కిల్ సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతలైన ఉద్యోగులకు సీఎండీ పుల్లారెడ్డి చేతుల మీదుగా బహుతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీడీసీఎల్ డైరెక్టర్‌లు మురళీకృష్ణయాదవ్ (టెక్నికల్), ఎస్ వెంకటేశ్వర్లు (ఫైనాన్స్), గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ చల్లా రమేష్, ఎస్‌ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులున్నారు.

కొరియన్ భాషతో భవిష్యత్తు అవకాశాల విస్తరణ

● కౌన్సిల్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా చాంగ్ న్యూన్ కిమ్


మాట్లాడుతున్న కిమ్, విద్యార్థినుల నృత్యాలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొరియన్ భాషా అభ్యాసం కొనసాగిస్తూ.. ఉన్నత స్థాయి ప్రావీణ్యం సాధించడం ద్వారా భారత విద్యార్థులు, యువతకు కొరియా, కొరియన్ కంపెనీలతో భవిష్యత్తు అవకాశాలను విస్తరించవచ్చని చెన్నైలోని కౌన్సిల్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా చాంగ్ న్యూన్ కిమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం "కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్"ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాంగ్ న్యూన్ కిమ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న పోటీ పరిస్థితుల్లో ఆసియా ఖండంలో భారత్, కొరియా కీలక భాగస్వాములని పేర్కొన్నారు. కొరియా సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని, భారతదేశ ప్రజలు విపరీతంగా ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్‌లో 311.44 టీఎంసీలు

విజయపురిసౌత్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం గురువారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,700, ఎడమ కాలువ ద్వారా 6,949 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,698, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 53,047 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 80,714 క్యూసెక్కులుగా ఉంది.

పులిచింతలలో 43.79 టీఎంసీలు..

అచ్చంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 43.79 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 32,726 క్యూసెక్కుల నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద 16,600 క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా, 400 క్యూసెక్కులు లీకుల ద్వారా, ఒక గేటు ద్వారా 24,063, మొత్తం 41,063 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాకు..

2,640 మెట్రిక్ టన్నుల యూరియా


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న జేసీ, డీఏఓ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు మరో 2,640 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. గుంటూరు సమీపంలోని రెడ్డిపాలెం రైల్వే స్టేషన్‌కు చేరిన యూరియా నిల్వలను జేసీ అశుతోష్ శ్రీవాస్తవ గురువారం పరిశీలించారు. యూరియాను సొసైటీలు, మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలర్లకు దామాషా పద్ధతిలో కేటాయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు.

మంత్రి నారా లోకేశ్ కృషితో..

స్వస్థలాలకు తెలుగువారు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారు మంత్రి నారా లోకేశ్ కృషితో స్వస్థలాలకు తీసుకురావడం జరుగుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం పేర్కొన్నారు. తెలుగు వాళ్లు ఎక్కడ ఏ ఆపదలో ఉన్నా స్పందించి సురక్షితంగా స్వస్థలాలకు చేరుస్తున్నటువంటి యంగ్ డైనమిక్ లీడర్ నారా లోకేశ్ అని కొనియాడారు. అన్నారు. నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో తెలుగు ప్రజలు చిక్కు కున్నారనే విషయం తెలిసిన వెంటనే.. క్షణం కూడా ఆలస్యం చేయకుండా అనంతపురం పర్యటన రద్దు చేసుకున్నారని గుర్తుచేశారు. సచివాలయం రియల్ టైమ్ గవర్నెన్స్ రూమ్‌ని కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి వేగవంతంగా చర్యలు చేపట్టారన్నారు. బాధితులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ.. లొకేషన్ కోఆర్డినేటర్లతో రూట్ మ్యాప్ సిద్ధం చేయించి, ఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో ఒక నాయకుడు ఆంధ్ర ప్రజలు నేపాల్‌లో చిక్కుకున్న ఘటనపై నోరు మెదపక పోవడమే కాకుండా.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వ్యాఖ్యలు చేస్తూ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక


బాల బాలికల సెపక్ తక్రా జిల్లా జట్లు

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14, 17 బాల బాలికల జిల్లా సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు మండలంలోని నందిగామ జడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బాల బాలికల విభాగంలో 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేశ్ కుమార్ తెలిపారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా లాకు పిచ్చయ్య, బి. అనీల్ దత్త నాయక్, కోనంకి కిరణ్ కుమార్ వ్యవహరించారు. పీడీలు దాసరి కోటేశ్వర రావు, పాఠశాల హెచ్ఎం కాకరపర్తి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గండు సాంబశివరావు, తులసీ రామ్ నాయక్, రత్నాకర్, మెహబూబీ, కె. స్వాతి, సీహెచ్ అనూష పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల.. కాంట్రాక్టర్లను బెదిరించడం దుర్మార్గం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందడం జగన్‌కు ఇష్టంలేదని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అందుకే ప్రభుత్వం త్వరగా పూర్తిచేయాలనుకుంటున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను అడ్డుకుంటామని, కాంట్రాక్టులు పొందినవారి టెండర్లు రద్దుచేస్తామని జగన్ బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. గురువారం తన నివాసంలో నాదెండ్ల, యడ్లపాడు మండలాల పరిధిలోని పలువురికు రూ.25 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల ఆరోగ్యరక్షణ కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో సంజీవని పథకాన్ని తీసుకురాబోతున్నారని చెప్పారు. మెడికల్ కాలేజీల నిర్మాణంలో ప్రభుత్వం అనుసరిస్తున్న పీపీపీ విధానం తనకు ఎందుకు నచ్చలేదో జగన్ సమాధానం చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. పీపీపీ విధానమంటే గతంలో తాను అవలంబించిన డీబీటీ విధానంలా అవినీతికి ఆస్కారం ఉండేది కాదనే నిజాన్ని జగన్ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల టీడీపీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌లో తెలుగు ప్రజలకు రక్షగా నారా లోకేశ్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



పొన్నూరుటౌన్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): సంక్షోభ నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగు వారికి అండగా నిలిచి.. వారిని సురక్షితంగా..ఏపీకి రప్పించడంలో యువనేత మంత్రి నారా లోకేశ్ కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ గురువారం కొనియాడారు. తెలుగు ప్రజల పట్ల టీడీపీ చిత్తశుద్ధిని.. ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను మంత్రి లోకేశ్ చాటి చెప్పారన్నారు. తెలుగు వారిని.. అనుక్షణం కాపాడుకునేలా ఒక్క సమాచారంతో స్పందించి.. అనుక్షణం చర్యలు చేపట్టిన యువనేతకు దేశ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. తెలుగు వారికి విపత్తులు, ఆపద పదం వినపడితే మొదటి స్పందించింది తెలుగుదేశం పార్టీ, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు అన్నారు. తాతా తండ్రులను అనుసరించడమే కాకుండా నారా లోకేశ్ నేడు చేసిన కృషి వారందరికీ తగ్గ భవిష్యత్తు నాయకుడిగా చాటారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం ప్రజలకు ఆహారం మీరు వసతి సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టడం కేంద్ర సహకారంతో సమన్వయంతో ఆపదలో ఉన్న ఒక్కొక్కరిని సురక్షితంగా రక్షించడానికి లోకేశ్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లారన్నారు. నేపాల్ లో జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న సుమారు 215 తెలుగు ప్రజలను సురక్షితంగా మాతృభూమికి తీసుకురావడంలో లోకేష్ పాత్ర కీలకమన్నారు.

'వీఐటీ'లో నేషనల్ సెమీ కండక్టర్ టెక్నాలజీ సింపోజియం


పాల్గొన్న ప్రముఖులు, యాజమాన్య సభ్యులు

తుళ్లూరు, (ఐనవోలు) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సెమీ కండక్టర్ టెక్నాలజీ సింపోజియం (ఎన్ఎస్‌టీఎస్) 2025 ప్రారంభోత్సవం రాజధాని అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఘనంగా గురువారం ప్రారంభమైంది. ఈ సింపోజియం ఈ నెల 13 తేదీ వరకు జరగనుంది. ఈ మూడు రోజుల సింపోజియంను వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, స్టూడెంట్ బ్రాంచ్, మైక్రోవేవ్ థియరీ అండ్ టెక్నిక్స్ సొసైటీ మద్దతు ఇస్తున్నాయి. స్వదేశీ ఆవిష్కరణ, నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ-విద్యా సహకారంపై దృష్టి సారించడం ద్వారా భారతదేశం సెమీ కండక్టర్ ప్రస్థానాన్ని ముందుకు తీసుకువెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వీఐటీ పేర్కొంది. ఈ సింపోజియంలో 400 మందికి పైగా ప్రతినిధులు, ప్రపంచ, జాతీయ కంపెనీల నుంచి 20 మందికి పైగా పరిశ్రమ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపింది. ఈ కార్యక్రమంలో 12 మంది నిపుణుల చర్చలు, ఓపెన్ చిప్ డిజైన్, ఎడ్జ్ కంప్యూటింగ్ నుంచి మొబిలిటీ, హెల్త్‌కేర్ స్వదేశీ ఆవిష్కరణల వరకు అంశాలను కవర్ చేసే రెండు ప్యానెల్ చర్చలు ఉన్నాయి. ప్రారంభ రోజున వర్సిటీ ఇన్వెంటిజ్, సాయంట్ ఇండియా అనే నాలుగు మార్గదర్శక కంపెనీలతో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు మీద సంతకాలు జరిగాయి. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, సీఐఐ ఆంధ్ర ప్రదేశ్ వైస్ చైర్మన్, అపెక్స్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్ర కె.శరణం, వీఐటీ వర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.వి. కోటారెడ్డి మాట్లాడారు. ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, శరవణన్ జయరామన్, ప్రొఫెసర్ డాక్టర్ అమీత్ చవాన్, డాక్టర్ ఉమాకాంత్ నందా తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

తెలుగు వారికి ఎక్కడ ఆపద ఉంటే..

అక్కడ టీడీపీ ఉంటుంది: యరపతినేని

● నేపాల్ ఘటనలో లోకేశ్ స్పందన భేష్



పిడుగురాళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి ఎక్కడైనా ఆపద అనే పదం వినిపిస్తే అక్కడ టీడీపీ అండగా ఉంటుందనేందుకు నేపాల్ ఘటనతో లోకేశ్ మరోసారి రుజువు చేశారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు. నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో చిక్కుకున్న తెలుగు వారిని రక్షించేందుకు అనంతపురం పర్యటన కూడా రద్దు చేసుకొని సచివాలయానికే పరిమితమయ్యారన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ నుంచి కమాండ్ కంట్రోల్ ద్వారా సహాయక చర్యలు వేగవంతం చేశారని పేర్కొన్నారు. ప్రత్యేక విమానం ద్వారా 215 మందిని స్వస్థలాలకు తీసుకురావడంలో లోకేశ్ కీలకపాత్ర వహించారన్నారు.

మంత్రి లోకేశ్ చొరవ అభినందనీయం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం చొరవ మానవీయ విలువలకు ప్రతిబింబంగా నిలిచిందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నేపాల్‌లోని తెలుగు వారిని రక్షించి, స్వదేశానికి తిరిగి తీసుకువచ్చే చర్యలు వేగంగా, సమర్థంగా జరుగుతున్నాయని తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వం నేపాల్‌లో చిక్కుకున్న వారిని తీసుకురావడానికి ఇలాంటి ప్రయత్నం చేయలేదని, కూటమి ప్రభుత్వమే ఈ విధంగా ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రజల పట్ల బాధ్యత, సంక్షేమ దృక్పథానికి ఇది నిదర్శనంగా పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి లోకేష్ అనంతపురం పర్యటన రద్దు చేసుకుని మరీ అమరావతిలోని ఆర్టీజీఎస్ ఆఫీస్‌కు చేరుకుని ఎప్పటికప్పుడు సమీక్షించడం, ప్రభుత్వం ఢిల్లీలో ప్రత్యేక విమానం ఏర్పాటు చేయడం ద్వారానే తక్షణ ఉపశమనం అందించగలిగామన్నారు.

గడువు.. మూడు రోజులే

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 30 బార్లకు రెం డు దరఖాస్తులు వచ్చాయి. అంటే ఇప్ప టి వరకు మూడు జిల్లాల పరిధిలో బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన రీ నోటిఫికేషన్‌కు స్పందన తీసికట్టుగా నే ఉన్నట్లు అర్థమవుతోంది. బాపట్ల జిల్లాలో 19 బార్లలో తొలి విడతలో నాలుగు బార్లకు లాటరీ నిర్వహించారు. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా నిబంధనల ప్రకారం 60 దరఖాస్తులు రావాల్సి ఉండగా ఐదు మాత్రమే రావడంపై ఎక్సైజ్ అధికారులు విస్తుపోతున్నారు. గుంటూరు జిల్లాలో 110 బార్లకు 43 బార్లకు లాటరీ నిర్వహించగా మిగిలిన 67 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాగా ఇప్పటి వరకు మంగళగిరి, పొన్నూరులో ఒక్కొక్క బార్‌కు నాలుగేసి చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. పల్నాడు జిల్లాలో 49 బార్లకు తొలివిడతలో 19 బార్లను లాటరీ ద్వారా కేటాయించారు. మిగిలిన 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా పిడుగురాళ్లలో రెండు బార్లకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చాయి. కాగా రీ నోటిఫికేషన్ గడువు ప్రకారం శుక్రవారం వచ్చే దరఖాస్తులపైనే ఎక్సైజ్ అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆశావహులతో సమావేశమైన అధికారులు దరఖాస్తు చేయాల్సిందిగా కోరారు. ఓ వైపు వ్యాపారుల నుంచి స్పందన లేకపోవడం, మరోవైపు ముంచుకొస్తున్న గడువు, ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో నేపథ్యంలో ఏమిచేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం సగం బార్లకు అయినా దరఖాస్తులు రావాలని, లేనిపక్షంలో వైఫల్యంగా భావించి చర్యలు తప్పవనే సంకేతాలను ఇప్పటికే అధికారులకు పంపారు. దీంతో ముందునుయ్యి వెనక గొయ్యిలాగా ఎక్సైజ్ అధికారుల పరిస్థితి మారింది. చివరి ప్రయత్నంగా గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారితో పాటు, బార్ల వ్యాపారంలో అనుభవం ఉన్న వారితో శుక్రవారం మరోమారు సంప్రదింపులు జరపడానికి ఎక్సైజ్ విభాగం సిద్ధమవుతోంది. బార్ల వ్యాపారం లాభసాటిగా ఉంటుందని దరఖాస్తులు చేయాలని అటు అసోసియేషన్ నాయకులతో పాటు ఈ రంగంలో అనుభవజ్ఞులను అధికారులు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం పవన్ పర్యటన రద్దు

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూర్యలంకలో జరిగిన జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవ కార్యక్రమానికి ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరుకావాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవడంతో పర్యటన రద్దైనట్లు గురువారం ఉదయం ప్రకటించారు. అప్పటికే పెద్దఎత్తున ఏర్పాట్లుచేయడంతో రాష్ట్రస్థాయిలోని అటవీశాఖ అధికారుల సమక్షంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు.

హిందూ ధర్మరక్షణకు గ్రామ ధార్మిక సమితి బాధ్యత వహించాలి

కొల్లూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మరక్షణ కోసం గ్రామ ధార్మిక సమితి సభ్యులు బాధ్యత వహించాలని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు సూచించారు. గురువారం మండలంలోని ఈపూరులంక రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ ధార్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచారక్ మాట్లాడుతూ, గ్రామంలోని హిందువులందరూ ఐక్యంగా ఉంటూ హిందూ ధర్మరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చిట్టా రాముడు, ధార్మిక సంస్థ కన్వీనర్ యడ్లపల్లి సుధాకరరావు, ధార్మిక సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి

వేమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి పేర్కొన్నారు. గురువారం జడ్పీహైస్కూల్లో బాలికల సంరక్షణపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాల నియంత్రణపై తల్లిదండ్రులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే మాజీ సైనిక సంక్షేమ సంఘం లక్ష్యం

● రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే మాజీ సైనిక సంక్షేమ సంఘం లక్ష్యమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించటానికి నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. కావున మాజీ సైనికులు వారి సమస్యలను అసోసియేషన్‌ల ద్వారా రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.బుచ్చిరాజు

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.బుచ్చిరాజు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆటోయూనియన్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ వాహనమిత్ర పథకం లబ్ధిదారులను పెంచాలన్నారు. సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి జీవో నెంబరు 21 రద్దు చేయాలన్నారు. వాహన మిత్ర పథకం కింద రూ.15వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, నాగరాజు, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు రాక్షస ప్రవృత్తికి నిదర్శనం

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడులు రైతులకు యూరియా సక్రమంగా అందించ లేనందుకు బావిలో దూకి చావాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దూషించడం అతడి కక్షపూరిత నేరస్వభావానికి నిదర్శనమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో కూడా చంద్రబాబుపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేసిన జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా ఈ విధంగా మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు.

పోక్సోయాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏవీవీ హైస్కూల్లో గురువారం పోక్సో యాక్ట్, బాల్యవివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల బాలల పరిరక్షణ అధికారి జి.కృష్ణ బాగుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి తెలియజేశారు. పిల్లలు అత్యవసర పరిస్థితిలో 1098కి ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వై.సత్యవతి, అబ్దుల్ కరీం, పి.నాగేశ్వరరావు, వి.లక్ష్మీనిర్మల, ఎం.దుర్గ, ఎల్.కోటేశ్వరమ్మ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

14న బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణంలో ఈనెల 14వ తేదిన జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పీడీ కత్తిశ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపికలకు 2005 డిసెంబరు 31వ తేదీ తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. బాలురు 75 కిలోలు, బాలికలు 65కిలోలలోపు ఉండాలన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు ఒరిజినల్ తీసుకురావాలన్నారు. మధ్యాహ్నం 3గంటలు నుంచి ఎంపికలు జరుగుతాయని అసోసియేసన్ కార్యదర్శి మంతెన సుబ్బరాజు తెలిపారు. వివరాలకు 9346258841లో సంప్రదించాలన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కొల్లూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరు ఇసుక ట్రాక్టర్లను ప్రొహిబిషన్ ఎస్‌ఐ శ్రీనివాస్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. గురువారం మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణానదిలో ఇసుకను అక్రమంగా తవ్వి రావాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను తనిఖీ చేయగా వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణా చేస్తున్న వాహనదారులను తహసీల్దార్ ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆటోస్టాండ్ ప్రారంభం

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోస్టాండ్‌ను ఏర్పాటుచేశారు. దీనిని జిల్లా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం బుచ్చిరాజు సీఐటీయూ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు కె.శరత్ మాట్లాడారు. కార్యక్రమంలో కె.మరియదాసు, డి.శ్రీనివాసరావు, పి.వీరారెడ్డి, కె.ఏలీషాబాబు, కర్రి శ్రీను, షేక్.వల్లి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌ఫెస్టివల్‌కు శ్రీవరసిద్ధి వినాయక కన్‌స్ట్రక్షన్స్ విరాళం

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో నిర్వహించే బీచ్‌ఫెస్టివల్‌కు శ్రీవరసిద్ధి వినాయక కన్‌స్ట్రక్షన్స్ రూ.50వేల చెక్కును గురువారం ఎమ్మెల్యే నరేంద్రవర్మకు అందజేశారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తమవంతు వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టనర్స్ కె.గంగాధరరావు, జి.శ్రీనివాసరావు, సాంబశివరావు, సుబ్రహ్మణ్యం ఉన్నారు.



ఎమ్మెల్యే నరేంద్రవర్మకు చెక్ అందజేస్తున్న శ్రీవరసిద్ధి వినాయక కన్‌స్ట్రక్షన్స్ పార్టనర్స్

ప్రమాదాలకు నిలయంగా రహదారి

● నిజాంపట్నం రోడ్డుపై భారీ గుంతలు

● వాహనచోదకులకు ప్రయాణం నరకం



గుంతలమయంగా నిజాంపట్నం రహదారి

రేపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రహదారిపై భారీ గుంతలుగా ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. నిజాంపట్నం గ్రామంలో ప్రధాన రహదారి మోకాలులోతు గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనాలు, బస్సులు, కార్లు, లారీలు వెళ్లా లంటే నానా ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతలో పడితే పైకిలేచే పరిస్థితి లేదు. తక్షణమే అధికారులు దృష్టిసారించి ఈ రహదారి మరమ్మతులు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిధులు మంజూరైన రహదారి వేయటంలో గుత్తేదారు లు కాలయాపన చేస్తున్నారు. దీంతో గుంతలు పడిన రహదారిలో ప్రయాణం చేయాలంటేనే ప్రమాదాలు కొనితెచ్చుకోవాల్సిందేనని వాహనచోదకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి రహదారిని అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

ప్రతి రైతుకు యూరియా సరఫరా

● తహసీల్దార్ సుశీల

వేమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతుకు యూరియా సరఫరా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ సుశీల పేర్కొన్నారు. గురువారం ఆమె స్థానిక యూరియా మార్కెట్ యార్డులు, డీసీఎంఎస్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్న కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 148.8.6 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి 1248.435 మెట్రిక్‌టన్నుల సరఫరా అయిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఏవో ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ, ముందస్తుగా రైతులకు టోకెన్లు ఇచ్చి యూరియా అందిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో పెరవలి సొసైటీకి కూడా యూరియా సరఫరా చేస్తామన్నారు.



పిట్టలవానిపాలెం: రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు మూర్తిరాజు తదితరులు



వేమూరు మార్కెట్ యార్డులో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుశీల

నత్రజని వాడకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- ఏవో బ్రహ్మారెడ్డి

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు నత్రజని (యూరియా) వాడకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో బి.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం కోనేటిపురం, భట్టిప్రోలులో రైతులకు యూరియా పంపిణీ చేశారు. మండలంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, యూరియాకు ప్రత్యామ్నాయంగా నానోయూరియా వినియోగించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కొల్లూరు: ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి

రైతులకు అవసరం మేరకే యూరియా లభిస్తుంది

- పీఏసీఎస్ అధ్యక్షుడు పెనుమత్స మూర్తిరాజు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరు పీఏసీఎస్‌లో రైతులకు 20 టన్నుల యూరియాను అధ్యక్షుడు పెనుమత్స మూర్తిరాజు ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందోలు పోలీసు సిబ్బంది, మహిళా పోలీసుల సహకారంతో ప్రశాంత వాతావరణంలో రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, తాగునీటి సంఘం అధ్యక్షుడు అచ్యుత రామరాజు, రైతు సేవాకేంద్రం సహాయకురాలు వడ్లమూడి శివనాగేశ్వరి, ఏఈవో పార్వతి, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఖాజీపాలెంలో మనగ్రోమోర్ ఆధ్వర్యంలో రైతులకు 20 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏవో సత్యానంద్ తెలిపారు.

కార్యకర్తల యోగక్షేమమే జనసేన లక్ష్యం

● గాదె వెంకటేశ్వరరావు

కర్లపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల యోగక్షేమమే జనసేన పార్టీ లక్ష్యమని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో ప్రమాదవశాత్తు మరణించిన జనసైనికులు బాలిగ హరీష్, మరకా రాజుల కుటుంబసభ్యులకు గురువారం జనసేనపార్టీ నాయకులు నామన వెంకటశివన్నారాయణ, విన్నకోట సురేష్‌ల ఆధ్వర్యంలో గాదె వెంకటేశ్వరరావు, కిలారి రోశయ్యలు రూ.5లక్షల బీమా చెక్కులను కుటుంబసభ్యులకు అందజేశారు ఈ చెక్కులను వలంటీర్ ఇక్కుర్తి చక్రపాణి చేతుల మీదగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, బాపట్ల మార్కెట్‌యార్డు డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, జనసేన లీగల్‌సెల్ సభ్యురాలు జిడుగు విజయమాధురి, తోట శ్రీనివాసరావు, కొసన రామయ్య, ఊసా మాధవి, ఆకిశెట్టి నాగమల్లేశ్వరి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



హరీష్ కుటుంబసభ్యులకు రూ.5లక్షల బీమా నగదు పత్రాన్ని అందజేస్తున్న గాదె వెంకటేశ్వరరావు, వెంకటశివన్నారాయణ, సురేష్, రోశయ్య

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక



కొల్లూరు: పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లలితకుమారి



పిట్టలవానిపాలెం: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో ఎస్‌వీ శివబాబు, మండల వ్యాయామ కోర్డినేటర్ ఎం ప్రశాంత్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కోసం పోటీలను ఎంపీపీ లలిత కుమారి ప్రారంభించారు. గురువారం స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కోసం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17 బాల బాలికలకు రన్నింగ్, షార్ట్‌పుట్, డిస్కస్ త్రో తదితర అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో పోటీలు జరిగాయి. పోటీలలో మండలంలోని ఏడు జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 100 మంది బాలబాలికలు పాల్గొన్నారు. శుక్రవారం కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నీలం దేవరాజు, సర్పంచ్ దారా కిరణ్మయి, రాంప్రసాద్, పి.మల్లికార్జునరావు, మహ్మద్ అనుల్‌హక్, నాగేశ్వరరావు, హరిప్రసాద్, వీర్ల శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి పాఠశాల క్రీడల ఎంపికలు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి పాఠశాల క్రీడల ఎంపికలు ఈనెల 12 నుంచి పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతాయని ప్రధానోపాధ్యాయుడు ఎంవీ శివబాబు తెలిపారు. ఆసక్తి కలిగిన వివిధ పాఠశాలల విద్యార్థులు వివరాలకు మండల వ్యాయామ కోఆర్డినేటర్ ఎం.ప్రశాంత్ బాబు, 89859 95544లో సంప్రదించాలని తెలిపారు. గురువారం అక్కడ జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి ఎంఈవో ఎస్‌వీ శివబాబు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లా, ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి జీవోలను ఖండిస్తున్నాం

● సీపీఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాపట్ల మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో నిర్మించాలన్న క్యాబినెట్ నిర్ణయాన్ని, అర్ధరాత్రి జీవోలను ఖండిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పేర్కొన్నారు. గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయడానికే ఈ పద్ధతిలో మెడికల్ కాలేజీలను నిర్మించాలని చూడటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం మొదటి దశలోనే బాపట్ల మెడికల్ కాలేజి నిర్మాణాన్ని చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కూలీ మృతి

మోపిదేవి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నుంచి బాపట్ల జిల్లా కొల్లూరుకు ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని నాగాయలంక వైపునుంచి వస్తున్న కంటైనర్ బుధవారం రాత్రి మోపిదేవి శివారులో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు గ్రామానికి చెందిన గొరిపర్తి సుబ్రహ్మణ్యం(30) మచిలీపట్నంలో తాపీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్మార్ట్ రేషన్‌కార్డు తీసుకునేందుకు మచిలీపట్నం నుంచి కొల్లూరుకు మోటారుబైక్‌పై బయలుదేరాడు. నాగాయలంక నుంచి విశాఖపట్నం వెళుతున్న కంటైనర్ మోపిదేవి శివారులో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వీఆర్వో శ్రీనివాసరావు పంచనామా నిర్వహించారు. మోపిదేవి ఎస్‌ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న గణితశాస్త్ర విభాగాధిపతులు

బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో గణిత శాస్త్ర విభాగంవారు నిర్వహించిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. 'అడ్వాన్సింగ్ ఇన్నోవేషన్స్ త్రూ మేథమెటిక్స్-2025'ను కళాశాల గణితశాస్త్ర విభాగం, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో 94మందికి పైగా పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు. 80కిపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. అంతర్జాతీయ సదస్సులో గణితశాస్త్ర నిష్ణాతులు, రీసోర్స్ పర్సన్స్ చైర్‌పర్సన్స్‌గా పాల్గొని వివిధ రంగాల్లో మేథమెటిక్ అప్లికేషన్స్‌పై ప్రసంగించారు. ముగింపు సభలో ప్రిన్సిపాల్ ఎన్ రమాదేవి మాట్లాడుతూ చక్కటి ప్రణాళికతో, పరిశోధకులకు ఉపయుక్తమైన ఇటువంటి అంతర్జాతీయ సదస్సును నిర్వహించిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పరిశోధన పత్రాలు సమర్పించిన పరిశోధకులకు తమ శుభాకాక్షలు తెలియజేశారు. కన్వీనర్ కేవీఎల్ఎన్ ఆచార్యులు మాట్లాడుతూ అధ్యాపకుల జ్ఞానసంపదను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలకు వెన్నుతట్టి ప్రోత్సహించే బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీవారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్ డాక్టర్ నూరుబాషరపీ, ఖాదర్, వాసవి, విమల తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు అత్యున్నత ప్రశంసాపత్రం



నాగేశ్వరరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి డి.సామ్రాజ్యం

కర్లపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ బాపట్ల డిపోలో ట్రాఫిక్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పోకల నాగేశ్వరరావుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జోన్-3 నెల్లూరు వారిచే ఆగస్టు 15వ తేదీన అత్యుత్తమ ప్రశంసాపత్రం ఎంపికైందని ఆయన తెలిపారు. గురువాం బాపట్లజిల్లా ప్రజారవాణా శాఖాధికారి డి.సామ్రాజ్యం చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును డిపో అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు జిట్టా శ్రీనివాసరావులు అభినందించారు.



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

క్రీడలు శారీరక దారుఢ్యం, ఉన్నతికి దోహదం

● ఎంఈవో విజయశ్రీ

కర్లపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడల ద్వారా విద్యార్థి దేహదారుఢ్యం మెరుగుపడటమే కాకుండా వారి ఉన్నతికి కూడా బాటలు వేస్తాయని ఎంఈవో విజయశ్రీ అన్నారు. మండలంలోని యాజలి గ్రామంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి పోటీలను యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చారు. ఖోఖో, చెస్, షటిల్ బ్యాడ్మింటెన్, వాలీబాల్, షాట్‌పుట్,పరుగుపందెం మండలస్థాయి పోటీలను నిర్వహించారు. ఎంఈవో విజయశ్రీ పోటీలను ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు. ఈ పోటీలలో కర్లపాలెం హైవెండ్ హైస్కూల్, కర్లపాలెం, గణపవరం, పెదగొల్లపాలెం, చింతాయపాలెం, యాజలి, పేరలి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా మండల స్థాయి క్రీడలు

వేమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపని జడ్పీహైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి మండల స్థాయి క్రీడాపోటీలను గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం బదరీనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలను ఎంఈవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో వాలీబాల్, షటిల్, కబడ్డీ, ఖోఖో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా జంపని, చావలి, వరహాపురం, కుచ్చెళ్లపాడు జడ్పీ హైస్కూలుకు చెందిన 50మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారు. సాగర్, రాంబాబు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గుర్తింపు పొందినవారిని డివిజన్ స్థాయి పోటీలకు పంపుతామన్నారు.


పూర్వ వీసీలను సత్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ రత్న షీలామణి తదితరులు

నైపుణ్యాల పెంపుతో.. పోటీ ప్రపంచంలో రాణించాలి

● ఏఎన్‌యూ 49వ వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ ఆచార్య గంగాధరరావు ● ఘనంగా స్వర్ణోత్సవాలు ప్రారంభం

ఏఎన్‌యూ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):సాంకేతిక నైపుణ్యాలతోనే విద్యార్థులకు అభివృద్ధి అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ 49వ వ్యవస్థాపక దినోత్సవం వర్సిటీలోని డైక్‌మెన్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా జ రిగింది. తొలుత ఆచార్య నాగార్జునుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి స్వర్ణోత్సవాలను ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు రెక్టార్ రత్న షీలామణి అధ్య క్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో అధ్యాపక పోస్టుల భర్తీ చేయాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా దేశ ప్రగతికి ప్రయోజనం కలుగుతుందన్నారు. అమరావతి ప్రాంతంలో ఉన్న ప్రైవేటు యూనివర్సిటీలకు దీటుగా ఏఎన్‌యూ ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య రత్న షీలామణి మాట్లాడుతూ ఏడాది కాలం పాటు స్వర్ణోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవాల లోగో ప్రత్యేకతను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ పూర్వ ఉప కులపతుల దూర దృష్టి విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహద పడిందన్నారు. ఏడాది పాటు నిర్వహించే వేడుకలకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని పూర్వ ఉప కులపతులను కోరారు. అనంతరం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉప కులపతులుగా విశిష్ట సేవలు అందించిన ప్రొఫెసర్ డి.రామకోటయ్య, ప్రొఫెసర్ సీవీ రాఘవులు, ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ వి. బాల మోహన్‌దాస్, ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎ. రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి, ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్, ప్రొఫెసర్ వి.దివ్య తేజోమూర్తి, ప్రొఫెసర్ రమేష్ రాజు, డాక్టర్ పి.సుధాకర్‌ను కూడా ఘనంగా సత్కరించారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన జానపద, కూచిపూడి నృత్యాలు, విద్యార్థుల గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాళ్లు ఆచార్య వీరయ్య, ఆచార్య సురేష్ కుమార్, ప్రొఫెసర్ లింగరాజు, ప్రొఫెసర్ ప్రమీల రాణి, ప్రొఫెసర్ పాల్ కుమార్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సుమంత్ కుమార్, ప్రొఫెసర్ జగదీష్‌నాయక్, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ వెంకటేశ్వర్లు, రూసా డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్, డీన్ ఆచార్య వి రవికుమార్. సీడీఈ పరీక్షలు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్, యూజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్‌వీ కృష్ణారావు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ ఉపకులపతులు

తస్సదియ్యా.. రోశయ్యా



- వయస్సు మీద పడనివ్వని 82 ఏళ్ల వృద్ధ రైతు
- 75 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం.. అందులోనే ఆదాయం
- కుర్రాడిలా కొబ్బరి చెట్లెక్కి.. నెలకు రూ.20 వేల సంపాదన
- మోడల్ సాగుతో లాభాల పంటలు..
- ఆదర్శం.. అత్తోట రైతు జీవన విధానం

ఎనిమిది పదుల వయసు దాటిన వృద్ధుడు కొబ్బరి చెట్టును అవలీలగా ఎక్కి.. కాయలు కోస్తాడు అంటే నమ్మగలమా?!. ఇప్పటికీ సైకిల్‌ను సులువుగా తొక్కేస్తాడు అంటే విశ్వసిస్తామా? పొద్దు పొడవగానే దొడ్లో పశువుల పాలు పితుకుతాడు. అక్కడి నుంచి సైకిల్‌పై వెళ్లి పొలంలో పొద్దు పోయే దాక పనులు చేస్తాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా 75 సెంట్ల భూమిలో ఐదు లేయర్ మోడల్ (5 అంతస్థుల నమూనా) ను అమలు చేస్తున్న రైతు నామని రోశయ్య.. వ్యవసాయ క్షేత్రం గురించి తెలుసుకొందాం.



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కొల్లిపర మండలం.. అత్తోట గ్రామానికి చెందిన రైతు రోశయ్య.. కొబ్బరి, నిమ్మ, బొప్పాయి, అరటి, జామ, పసుపు, మామిడి, పూలు మొక్కలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఇలా మొత్తం 52 రకాల పంటలు పండిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను గ్రామంలోనే విక్రయిస్తూ.. నిత్యం ఆదాయం పొందుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రోశయ్యకు ఇద్దరు సంతానం. మొత్తం నాలుగు ఎకరాల సాగు భూమి ఉంది. ఇది నల్ల రకం నేల. ఎక్కువగా వరి సాగుచేస్తారు. చిన్న నాటి నుంచి వ్యవసాయ పనులు చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో.. పురుగు మందులు, ఎరువులతో పెట్టుబడి పెరిగిపోయింది. దీంతో ఆయన నష్టాలను చవి చూశారు. పిల్లలకు భూమిని పంచిపెట్టి తన భాగానికి వచ్చిన 75 సెంట్లలో ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు.

పాలేకర్ శిక్షణతో మార్పు

పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ పాలేకర్‌తో రాష్ట్ర ప్రభుత్వం


తేనె టీగల పెంపకం

ప్రకృతి వ్యవసాయం పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. గ్రామం నుంచి వ్యవసాయంతో మంచి అనుబంధం కలిగిన రోశయ్యని శిక్షణకు పంపించారు. ఆ రోజు నుంచి ఏపీ సీఎన్ఎఫ్ రూపొందించిన విధానాలను ఆయన అమలు చేశారు. 2016లో రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయ కుమార్ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆర్‌వైఎస్ఎస్ ఆవిష్కరణలో భాగంగా రూపొందించిన 5 లేయర్ మోడల్ విధానాన్ని రోశయ్య 75 సెంట్లలో సాగు చేస్తున్నారు. రెండు ఆవులను పెంచుకున్నారు. ఆవు మూత్రం, పేడను వేరు చేసి ఘన, ద్రవ జీవామృతం తయారు చేసి.. పొలంలో వినియోగిస్తు న్నారు.

నిత్యం ఆదాయం

రోశయ్యకు మొదట్లో పొలం మీద వచ్చే ఆదాయం తగ్గిపోయింది. అదనపు ఆదాయం కోసం 75 సెంట్ల చుట్టూ 40కి పైగా కొబ్బరి మొక్కలు పెంచారు. కొబ్బరి కాయల ద్వారా కొంత ఆదాయం పొందేవారు. 2016లో తర్వాత ప్రకృతి వ్యవ సాయం ఆవిష్కరణ లో భాగంగా రూపొందించిన ఐదు లేయర్స్ మోడల్ విధానం ప్రారంభించారు. ఈ నమూనాలో 50 రకాల మొక్కలను నాటారు. బొప్పాయి, అరటి, మామిడి, పైనాపిల్, అంజీర, ఆరెంజ్, పనస, నిమ్మ, నేరేడు, డ్రాగన్, రామ, సీతాఫలం, మునగ, యాలకులు, కంద, పసుపు, మునగ, జామ, సపోటా, పండ్లతో పాటు పూల మొక్కలను సాగు చేశారు. అశ్వగంధా ఆయుర్వేద మొక్కలు కూడా పెంచారు. పండిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను గ్రామంలోనే విక్రయిస్తూ నెలకు రూ. 20 వేల దాక ఆదాయం పొందుతున్నారు.

నేటికీ కొబ్బరి చెట్లు ఎక్కి..

ఎనిమిది పదుల రెండేళ్ల వయసులోనూ రోశయ్య శరీరం పట్టుతప్ప లేదు. ఇప్పటికీ కొబ్బరి చెట్టును సునాయాసంగా ఎక్కేస్తారు. రోజుకి మూడు చెట్ల కొబ్బరి కాయలు కోసి వాటిని గ్రామంలో విక్రయిస్తున్నారు. నిమ్మకాయలు, బొప్పాయి తదితర పండ్లనూ.. విక్రయిస్తారు. నేటికి ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. తోటలోని పంట ఉత్పతులను ఇంటిల్లిపాది తీసుకుం టారు. వయసు మీదపడుతున్నా కూడా తన పనులు చేసుకుంటూనే వ్యవసాయం చేయడంతో గ్రామంలో అందరికీ మార్గదర్శిగా నిలుస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అర్థం చేసుకోవాలి

- రైతు నామని రోశయ్య

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు అర్థం చేసుకోవాలి. అప్పుడే వ్యవసాయంలో మార్పులు వస్తాయి. తక్కువ పెట్టుబడి.. ఆరోగ్యకరమైన ఉత్పత్తులతో ఆదాయం లభిస్తుంది. నేలలో చాలా మార్పులు చోటుచేసుకోవడం గమనించాను. ప్రకృతి వ్యవసాయం వచ్చాక వ్యవసాయ విధానాల్లో చాలా మార్పులు వచ్చాయి. నేల ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం మెరుగుపడింది. నా చుట్టు పక్కల ఉన్న రైతులను మార్చాలని ప్రయత్నిస్తున్నా. కొందరు త్వరగా నమ్మరు. అయినా నా ప్రయత్నం మానుకోలేదు. ఇది ప్రపంచానికి అవసరం.



మూడు జిల్లాలకు నూతన కలెక్టర్లు

(5వ పేజీ తరువాయి)

పాటు ఇతర జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మా ట్లాడారు. అన్నింటికీ నిబంధనలు అని పోకుండా మానవీయ కోణంలో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. ఫేక్ ప్రచారాలు పెనుసవాల్‌గా మారాయని, వాటిపై రియల్‌టైంలో స్పందించాలని తెలిపారు. సీఎం అంటే కామన్ మ్యాన్ అని తాను చెబుతున్నానని, కలెక్టర్లు కూడా అదే పాటించాలన్నారు. తన ఆలోచనలు, అంచనాలను అందుకుని ఉత్తమ పనితీరు చూపాలన్నారు. ప్రభుత్వ విజయా ల్లో కలెక్టర్లదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. 360 డిగ్రీల్లో మీ పని తీరు పరిశీలించిన తర్వాతనే కలెక్టర్‌గా అవకాశం కల్పించామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం వారితోనే మమేకం కావాలన్నారు. ప్రజలు తమ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు లు తీసుకురావడానికి ఇదొక మంచి అవకాశమని తెలిపారు. కిందిస్థాయి అధికారుల్లో కూడా స్ఫూర్తిని నింపాలని సూచించారు. ఎమ్మెల్యేలకు తగిన గౌర వం ఇచ్చి వారు చెప్పే పనుల్లో మంచి, చెడు చూసి ప్రజలకు ఉపయోగపడేవి చేయాలన్నారు.

ప్రకాశం నుంచి గుంటూరుకు..

గుంటూరు జిల్లా కలెక్టర్‌గా తమీమ్‌అన్సారియా నియమితులయ్యారు. నాగలక్ష్మిని మార్చి ఆ స్థానంలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్న తమీమ్ అన్సారియాను ప్రభుత్వం నియమించింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అన్సారియా 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆమె కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ(పబ్లిక్ మేనేజ్‌మెంట్) చేశారు. 26 ఏళ్ల వయస్సులోనే 314వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2021లో శ్రీశైలం ప్రాజెక్టు, రాయలసీమ రీజియన్ ఎంఐజీ హౌసింగ్ ప్రాజెక్టులకు స్పెషల్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ లభించింది. ఆ తర్వాత 2022లో శ్రీశైలం ప్రాజెక్టు అధికారి, ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కమ్ స్పెషల్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకు అన్నమయ్య జేసీగా విధులు నిర్వహించారు. మ్యాటర్నిటీ, చైల్డ్‌కేర్ సెలవుల అనంతరం 2024లో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పోస్టింగ్ లభించింది. గత ఏడాది ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో అన్సారియా సామర్థ్యాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. అప్పటి నుంచి ఆమె ప్రకాశం కలెక్టర్‌గా కొనసాగారు.

బాపట్ల కలెక్టరు.. డాక్టర్

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వాసుదేవవినోద్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ వెంకటమురళిని ప్రభుత్వం బదిలీ చేసింది. నూతనంగా జిల్లా పగ్గాలు చేపట్టనున్న వినోద్‌కుమార్ 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. కర్ణాటకలోని హోసపేట ఈయన స్వస్థలం. వినోద్ స్కూలింగ్ మొత్తం శివమొగ్గ, దావణగెరలో సాగగా, బెంగళూరు వైద్య కళాశాలలో 2014లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అదే ఏడాది యూపీఎస్సీ పరీక్షల్లో ఐఏఎస్‌గా అర్హత సాధించారు. అనంతపురం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన తర్వాత రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా, పార్వతీపురం ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహించారు. నెల్లూరు జిల్లా జేసీ, ఏపీ ఆరోగ్య పీడీతో పాటు కమిషనర్‌గా, రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్‌గా సేవలందించారు. గతేడాది ఎన్నికలకు ముందు ఈసీ చేపట్టిన బదిలీల్లో డాక్టర్ వినోద్‌కుమార్‌ను అనంతపురం కలెక్టర్‌గా నియమితులు కాగా కూటమి ప్రభుత్వం ఆయనను కొనసాగించింది. తాజా బదిలీల్లో ఆయనను బాపట్ల జిల్లాకు నియమితులయ్యారు. గతేడాది జూలై 5న బాపట్ల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటమురళి 14 నెలలు బాధ్యతలు నిర్వహించారు.

తొలి మహిళా కలెక్టర్‌గా.. శుక్లా

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో కృతికశుక్లాను నియమించింది. కాగా జిల్లా ఏర్పడిన 2 ఏళ్ల ఐదు నెలల్లో శుక్లా నాలుగో కలెక్టర్‌గా రానున్నారు. 2024 జూలై 2న నియమితులైన అరుణ్‌బాబు గురువారం బదిలీ అయ్యారు. ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శిగా పనిచేస్తున్న కృతికశుక్లా పల్నాడు జిల్లాలో తొలి మహిళా కలెక్టర్‌గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. కృతిక జమ్మూకశ్మీర్ కేడర్ 2013 ఐఏఎస్ అధికారి. ఆమె ఏపీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. కాకినాడ జిల్లా కలెక్టర్‌గా, వయోజన విద్య డైరెక్టర్, ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్, ఉమెన్ డెవలప్‌మెంట్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్, జువైనల్ వెల్ఫేర్ ఎండీ, ఎయిడెడ్ సీనియర్ సిటిజన్ అసిస్టెంట్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, విశాఖ అసిస్టెంట్ కలెక్టర్, మదనపల్లి సబ్‌కలెక్టర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు జేసీగా ఆమె విధులు నిర్వహించారు. గత ప్రభుత్వం హయాంలో రూపొందించిన దిశకు ప్రత్యేక అధికారిగా ఆమె పనిచేశారు. కృతిక భర్త హిమాన్షుశుక్లా కూడా ఐఏఎస్ అధికారి. ప్రస్తుత బదిలీల్లో ఆయన నెల్లూరు కలెక్టర్‌గా నియమితులయ్యారు.

తురకపాలెం మరణాలపై..
కొనసాగుతున్న అధ్యయనం: కలెక్టర్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో అసాధారణ మరణాలపై అధ్యయనం కొనసాగుతోందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. తురక పాలెంలో ఇప్పటి వరకు నిర్వహించిన రక్త నమూనా పరీక్షల్లో ఇద్దరికి మాత్రమే మెలియాయిడోసిస్ జ్వరాలకు కారణమయ్యే బర్ఖల్‌దేరియా సూడోమల్లీ బ్యాక్టీరియాను గుర్తించినట్లు వెల్లడించారు. మట్టి నమునా పరీక్షల నివేదిక ఇంకా రావాల్సి ఉందన్నారు. మట్టిలో కూడా ఈ బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉందని ఆమె తెలిపారు. తురకపాలెంలో గత 15 ఏళ్లల్లో ఏటా సగటున 21 నుంచి 22 మరణాలు సంభవించినట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లినప్పుడు చర్మంపై పగుళ్లు ఉన్న వారికి ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విధంగా కూడా కొంత మందికి మెలియాయోడోసిస్ జ్వరాలు వస్తు న్నాయని భావిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి వివరించారు. తురకపాలెంలో ఆర్ఎంపీ వైద్యుడిపై పలు ఫిర్యాదులు తమకు అందా యని, వీటిపై విచారణ జరిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యులపై చర్యలు : కమిషనర్ వీరపాండియన్

తురకపాలెం ఘటనపై నివేదిక అందిన తర్వాత సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ బాధ్యులపై తప్పనిసరిగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటా మని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు.మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 'తురకపాలెంలోని మరణాల నమోదులో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు అలక్ష్యం జరిగింది. జిల్లా నుంచి రాష్ట్ర పర్యవేక్షణ అధికారులకు సమాచారం అందలేదు. శాఖపరమైన విచారణ నివేదిక అందిన వెంట నే బాధ్యులపై చర్యలు ఉంటాయి." అని వీర పాండియన్ స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల కారణాలు, సమస్యాత్మక ప్రాంతాల గురించి సి బ్బంది, అధికారులకు తెలుసని.. సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకురావడం లేదు? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లోనే భూమి శిస్తు చెల్లింపు

● రసీదు విధానానికి స్వస్తి ● రైతుల్లో కొరవడిన అవగాహన

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామాల్లో కరణాలు, మునసబులు వ్యవస్థ ఉండేది. ప్రతి రైతు నుంచి ప్రభుత్వం నిర్ణయించిన భూమిశిస్తును గ్రామ కరణాలు, మునసబులు వసూలు చేస్తుండేవారు. కొన్నేళ్ల తర్వాత శిస్తు రసీదు కనిపించకుండా పోతే.. ఇప్పటి దాకా వున్న భూమి శిస్తు బకాయి మొత్తం చెల్లించాల్సిందేనంటూ వసూలు చేసే వారు. తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆంధ్రాలో కరణాలు, మునసు బులు తెలంగాణలో పట్వారి వ్యవస్థలను రద్దుచేసి మండల వ్యవస్థను అమలులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి కూడా 2019 వరకు పాత విధానంలోనే భూమి శిస్తు వసూలు చేసేవారు. మొద ట్లో ఎకరా మెట్టకు రూ.35, మాగాణికి రూ.70 ఆ తరువాత మాగా ణికి రూ.50, మెట్టకు రూ.50.. తర్వాత క్రమంలో ఏ భూమికైనా ఎకరాకు రూ.200 శిస్తును ప్రభుత్వం శించింది.

రసీదు కనిపించకుంటే మళ్లీ మొదటికే..

గతంలో రైతు శిస్తులోని కొంత.. లేదా పూర్తిగా చెల్లించినా రసీదు అప్పటి కరణాలు, మునసుబులు, ఆ తర్వాత వీఆర్ఓలు ఇస్తుండేవారు. రెండేళ్లకు మళ్లీ శిస్తు చెల్లించాల్సి వచ్చినప్పుడు పాత రసీదులు చూసి మిగిలిన శిస్తు చెల్లించుకుంటూ ఉండేవారు. ఒకవేళ పాత రసీదు కనిపించకుండా పోతే మొత్తం నగదును శిస్తు రూపంలో చెల్లించేదాక రైతులపై ఒత్తిడి తీసుకొచ్చేవారు. ఈ క్రమంలో 2019లో రైతులకు మేలు కలిగించేలా చంద్రబాబు నాయుడు రెండు ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంతా ఆన్‌లైన్..

భూమి ఒకరి పేరు నుంచి మరొకరి పేరుకు రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత కొద్ది రోజుల్లోనే ఆటోమేటిక్ మ్యుటేషన్ జరిగే విధంగా నూతన విధానానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు.. శ్రీకారం చుట్టారు. దీనివల్ల రైతులు తమ వివరాలు భూ రికార్డులో నమోదు చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా పోయింది.

పాత విధానంలో శిస్తు చెల్లింపులో కొందరు అధికారులు సొంత రసీదులు రైతులకు అందించడంతో ప్రభుత్వ ఖజానాకు పడే గండి పడేది. దీంతో భూమి శిస్తు విధానాన్ని ఆన్‌లైన్ చేశారు. రైతు


కంది పంట సాగు

ఖాతా నంబరును ఓపెన్ చేస్తే.. భూమి మొత్తం విస్తీర్ణం, శిస్తు చెల్లింపుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు కనిపిస్తుం టాయి. పట్టణాల్లో ఆస్తి పన్ను చెల్లింపు విధానం మాదిరిగా రైతులు సంబంధిత సచివాలయాలు, మీ-సేవ, సెల్ ఫోన్ ద్వారా కూడా భూమిశిస్తు ప్రభుత్వానికి చెల్లించవచ్చు. చెల్లించిన తర్వాత బకాయి వివరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. దీంతో ఆన్‌లైన్‌లో చెల్లించిన రసీదు పొరపాటున కనిపించకుండా పోయినప్పటికీ రైతుకు ఇబ్బంది లేదు. ఖాతా నంబరు ఓపెన్ చేస్తే ఇంకెంత భూమిశిస్తు చెల్లించాలో ఆన్‌లైన్‌లో పూర్తిగా కనిపించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

రైతుల్లో తగ్గిన అవగాహన

భూమి శిస్తు ఆన్‌లైన్‌లో చెల్లించే విధానంపై రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. ఇంకా కొందరు రైతులు భూమి శిస్తు చెల్లించుకునేందుకు వీఆర్ఓలు తమ వద్దకు రాలేదేమిటని.. ఇంకా వసూళ్లు మొదలు పెట్టలేదేమోనన్న సందేహంతో నాలుగైదేళ్లుగా భూమి శిస్తు చెల్లింపులు చేయడం లేదు. రెవెన్యూ అధికారులు రైతులకు కొత్త విధానంపై అవగాహన కల్పిస్తే.. ప్రభుత్వానికి ఆదాయంతో పాటు రైతుకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

22 ఆలయాలకు
పాలక మండళ్ల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ శాఖ

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న 22 ఆలయాలకు పాలక మండళ్లను నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు గురువారం ఆ శాఖ జిల్లా అధికారి గ్రంధి మాధవి పేర్కొన్నారు.

ప్రత్తిపాడులోని దండేశ్వరస్వామి దేవస్థానం, వేణుగోపాలస్వామి దేవస్థానం, బాపతు చెన్నారెడ్డి సత్రం, కాకుమానులోని చెన్నకేశవ స్వామి దేవస్థానం, కట్టెంపూడిలో నాగేంద్ర స్వామి పుట్ట, నిడమర్రులో మల్లేశ్వరస్వామి దేవస్థానం, ఆంజనేయస్వామి దేవస్థానం, కురగల్లులో గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, ములుకుదురులో రామలింగేశ్వర స్వామి దేవస్థానం, కొమ్మూరులో అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం, నూతక్కిలో వరద వేణుగోపాల స్వామి దేవస్థానం, గుంటూరు స్తోత్ర సెంటర్‌లోని సీతారామ సేవ మండలి, విశదలలోని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం, తాడేపల్లిలోని విశ్వేశ్వరస్వామి దేవస్థానం, వంగీపురంలోని అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం, బేతపూడిలోని సోమేశ్వర స్వామి దేవస్థానం, చేబ్రోలులో నాగేశ్వర స్వామి, సీతానగర్‌లో సోమేశ్వర స్వామి దేవస్థానం, గుంటూరు రైలుపేటలోని ఇంకొల్లు మురహరి సత్రం, ఎర్రబాలెంలోని విశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొండమూడిలోని జనార్ధన స్వామి దేవస్థానానికి పాలక మండలి నియామకం చేపడుతూ ఉత్తర్వులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికపై ఉత్కంఠ

● 29తో ముగియనున్న కార్యవర్గం గడువు
● అధ్యక్ష బరిలో నిలుస్తానంటోన్న బాలకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపార వర్గాలకు ప్రతిష్ఠాత్మకమైన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఎన్నికపై ఈ దఫా ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత కార్యవర్గం గడువు ఈ నెల 29తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నిక ఏకగ్రీవమా లేక అనివార్యమా అనే ప్రచారం జోరందుకుంది. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడిగా మూడు దశాబ్దాలకు పైగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆతుకూరి ఆంజనేయులు ప్రస్తుతం చాంబర్‌కు శాశ్వత గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. కార్యవర్గం గడువు ఏడాది పాటు ఉంటుంది. ఇప్పటి వరకు.. పదవీ కాలం ముగిసేలోపు సర్వసభ్య సమావేశం నిర్వహించి, బరిలో ఎవరూ నిలవకపోతే ఏకగ్రీవం జరిగేది. అయితే గతేడాదిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష అభ్యర్థిగా రంగా బాలకృష్ణ బరిలో నిలవడంతో ఎన్నికలు అనివార్య మయ్యాయి. ఈ సమయంలో అధ్యక్ష అభ్యర్థిగా మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు ప్యానల్, రంగా బాలకృష్ణ ప్యానల్ ఎన్నికల బరిలో నిలవగా యేల్చూరి ప్యానల్ విజయం సాధించింది. రంగా బాలకృష్ణ ఈ దఫా కూడా అధ్యక్ష పదవికి ఎన్నికల బరిలో నిలుస్తానని చెప్పినట్లు చాంబర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే మరోసారి ఎన్నికలు తప్పవని చెబుతున్నారు.



బర్లీ పొగాకు సాగు చేయొద్దు

● ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ, మానవహారం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న రబీ సీజన్‌లో రైతులు నల్లబర్లీ/తెల్లబర్లీ పొగాకు పంటను సాగు చేయొద్దని కోరుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలులో గురువారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ సహాయ వ్యవసాయకులు, రైతులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండు వరకు, అక్కడి నుంచి తిరిగి చర్చిసెంటర్ వరకు నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణీ, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ వాణిశ్రీ, ఒంగోలు, దర్శి, సింగరాయకొండ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, బాలాజీనాయక్, నిర్మలాకుమారి ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వైద్యంభారం కాకుడదన్న ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకోంటోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెంది అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న 61 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం చిలకలూరిపేటలో మంత్రి రవికుమార్ అందజేశారు. ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

అద్దంకి : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించనున్నారు. సాయంత్రం 3.30 గంటల నుంచి అక్కడే ప్రజల నుంచి వివిధ సమస్య లపై అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 9.30 గంటలకు పంగులూరు మండలం బూదవాడ హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ, 11 గంటలకు ఒంగోలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం లలో పాల్గొననున్నారు.

మంత్రిని కలిసిన నూతన కమిటీ

పంగులూరు : టీడీపీ మండల అధ్యక్షుడు రావూరిరమేష్‌తో పాటు నూతన కమిటీ సభ్యులు గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన ఎన్నికకు రెండవసారి కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని నాయకులందరి సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రంఆదిశేఖర్, పూనాటి రామాంజనేయులు, అశోక్, ఆదిరెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనకవరంలో తీరిన మురుగునీటి సమస్య

● రూ.30 లక్షల నిధులతో పూర్తయిన ప్రధాన డ్రెయిన్ నిర్మాణం

● నిధులు మంజూరు చేయించిన మంత్రి రవికుమార్

పంగులూరు, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జనకవరం గ్రామంలో రూ.30 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రధాన సీసీ డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యింది. గ్రామంలో డ్రైనేజ్‌సరిగా లేకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలక ప్రజలు ఇబ్బంది పడేవారు. అధిక వర్షాలు పడిన సందర్భంలో కొండమూరు, పరిసర పొలాలలోని వర్షపు నీరు గ్రామంవైపు చేరుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను ముంచెత్తేది. దీంతో సమస్యను గ్రామ టీడీపీ నాయకులు గుర్రంశేఖర్, మరి కొందరు నేతలు సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసు కెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి రూ.20లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాటు రూ.10లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించారు. రూ.30 లక్షల ప్రభుత్వ నిధులతో మురుగునీరు ఊరి వెంబడి ఉన్న వాగులోనికి వెళ్లేలా సిమెంట్ డ్రైన్ నిర్మించారు. పక్కాడ్రైన్ నిర్మాణంతో మురుగు నీటి సమస్య తీర్చిన మంత్రి గొట్టిపాటికి జనకవరం గ్రామ స్థులు కృతజ్ఞతలు తెలిపారు.


గ్రామంలో పూర్తయిన ప్రధాన మురుగు కాలువ

ఇద్దరు అధికారుల బదిలీ

● మహిళా ఉద్యోగి పట్ల అసభ్య ప్రవర్తనే కారణమా?

తాళ్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగితో ఫోన్లో అసభ్య సంభాషణ చేశారన్న ఆరోపణ నేపథ్యంలో ఇద్దరు అధికారులను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం స్థానిక డిప్యూటీ ఎంపీడీవో దారా హనుమంతరావు, తాళ్లూరు పూర్వపు పంచాయతీ కార్యదర్శి ఐ.వి.రమణారెడ్డిలపై డిప్యూటేషన్‌పై బదిలీ వేటు వేస్తూ గురువారం డీపీవో ఎం.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. తాళ్లూరు మండల పరిషత్ పరిధిలోని సచివాలయ మహిళా ఉద్యోగిని ఫోన్ ద్వారా చాటింగ్ చేస్తూ అసభ్య సంభాషణ చేస్తున్నారని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై గత డీపీవో వెంకటప్పనాయుడును విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణ చేసి నివేదిక కలెక్టర్‌కు అందించారు. ఆ నివేదిక ఆధారంగా ఇరువురు ఉద్యోగులను క్రమశిక్షణా చర్యల్లో భాగంగా డిప్యూటీ ఎంపీడీవో హనుమంతరావును పుల్లలచెరువు మండలానికి, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డిని గిద్దలూరు మండలం నరవ గ్రామ సచివాలయంకు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన కలెక్టర్లు

(5వ పేజీ తరువాయి)

పాటు ఇతర జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు. అన్నింటికీ నిబంధనలు అని పోకుండా మానవీయ కోణంలో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. ఫేక్ ప్రచారాలు పెనుసవాల్‌గా మారాయని, వాటిపై రియల్‌టైంలో స్పందించాలని తెలిపారు. సీఎం అంటే కామన్ మ్యాన్ అని తాను చెబుతున్నానని, కలెక్టర్లు కూడా అదే పాటించాలన్నారు. తన ఆలోచనలు, అంచనాలను అందుకుని ఉత్తమ పనితీరు చూపాలన్నారు. ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. 360 డిగ్రీల్లో మీ పని తీరు పరిశీలించిన తర్వాతనే కలెక్టర్‌గా అవకాశం కల్పించామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం వారితోనే మమేకం కావాలన్నారు. ప్రజలు తమ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావడానికి ఇదొక మంచి అవకాశమని తెలిపారు. కింది స్థాయి అధికారుల్లో కూడా స్ఫూర్తిని నింపాలని సూచించారు. ఎమ్మెల్యేలకు తగిన గౌరవం ఇచ్చి వారు చెప్పే పనుల్లో మంచి, చెడు చూసి ప్రజలకు ఉపయోగపడేవి చేయాలన్నారు.

గడువు.. మూడు రోజులే

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 30 బార్లకు రెం డు దరఖాస్తులు వచ్చాయి. అంటే ఇప్ప టి వరకు మూడు జిల్లాల పరిధిలో బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన రీ నోటిఫికేషన్‌కు స్పందన తీసికట్టుగా నే ఉన్నట్లు అర్థమవుతోంది. బాపట్ల జిల్లాలో 19 బార్లలో తొలి విడతలో నాలుగు బార్లకు లాటరీ నిర్వహించారు. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా నిబంధనల ప్రకారం 60 దరఖాస్తులు రావాల్సి ఉండగా ఐదు మాత్రమే రావడంపై ఎక్సైజ్ అధికారులు విస్తుపోతున్నారు. గుంటూరు జిల్లాలో 110 బార్లకు 43 బార్లకు లాటరీ నిర్వహించగా మిగిలిన 67 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాగా ఇప్పటి వరకు మంగళగిరి, పొన్నూరులో ఒక్కొక్క బార్‌కు నాలుగేసి చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. పల్నాడు జిల్లాలో 49 బార్లకు తొలివిడతలో 19 బార్లను లాటరీ ద్వారా కేటాయించారు. మిగిలిన 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా పిడుగురాళ్లలో రెండు బార్లకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చాయి. కాగా రీ నోటిఫికేషన్ గడువు ప్రకారం శుక్రవారం వచ్చే దరఖాస్తులపైనే ఎక్సైజ్ అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆశావహులతో సమావేశమైన అధికారులు దరఖాస్తు చేయాల్సిందిగా కోరారు. ఓ వైపు వ్యాపారుల నుంచి స్పందన లేకపోవడం, మరోవైపు ముంచుకొస్తున్న గడువు, ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో నేపథ్యంలో ఏమిచేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం సగం బార్లకు అయినా దరఖాస్తులు రావాలని, లేనిపక్షంలో వైఫల్యంగా భావించి చర్యలు తప్పవనే సంకేతాలను ఇప్పటికే అధికారులకు పంపారు. దీంతో ముందునుయ్యి వెనక గొయ్యిలాగా ఎక్సైజ్ అధికారుల పరిస్థితి మారింది. చివరి ప్రయత్నంగా గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారితో పాటు, బార్ల వ్యాపారంలో అనుభవం ఉన్న వారితో శుక్రవారం మరోమారు సంప్రదింపులు జరపడానికి ఎక్సైజ్ విభాగం సిద్ధమవుతోంది. బార్ల వ్యాపారం లాభసాటిగా ఉంటుందని దరఖాస్తులు చేయాలని అటు అసోసియేషన్ నాయకులతో పాటు ఈ రంగంలో అనుభవజ్ఞులను అధికారులు కోరుతున్నారు.

అభివృద్ధే.. అజెండా..!

● ట్రంక్‌రోడ్ విస్తరణకు నేడు ఆమోదం

● నగరంలో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

● నేడు ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం



ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధే అజెండాగా.. నగరంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నేడు ఆమోదం లభించనుంది. యిందుకు సంబంధించి ప్రధానంగా నగర రహదారుల విస్తరణకు శ్రీకారం పలకగా, ప్రధానంగా ట్రంక్ రోడ్ విస్తరణే కీలకంగా నిలవనుంది. ఈ మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు 64 అజెండా అంశాలను సిద్ధం చేయగా, వాటిలో సీసీ రోడ్‌ల నిర్మాణం, సీసీ డ్రైన్‌లు, పార్కుల అభివృద్ధి, శ్మశాన వాటికల్లో సౌకర్యాలు, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఖాళీ భర్తీతోపాటు, పోతురాజు కాలువల ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. కాగా ఈ అంశాలన్నింటికీ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే పాలక వర్గ సమావేశంలో ఆ అంశాలన్నింటికీ ఆమోదం లభించనుంది.

రహదారులు విస్తరణ..

ఒంగోలు నగరానికి కార్పొరేషన్ హోదా లభించి సుమారు 14 ఏళ్ళు పూర్తి కావస్తుండగా, అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక సౌకర్యాలు, రహదారులు లేకపోవడంపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు నగర హోదాను దృష్టిలో ఉంచుకుని రహదారుల విస్తరణకు శ్రీకారం పలికారు. ఇప్పటికే కర్నూలు రోడ్, సీవీఎన్ సెంటర్ రోడ్, కొత్తపట్నం బస్టాండ్, గోరంట్ల కాంప్లెక్స్ రోడ్ విస్తరణ పనులు జరుగుతుండగా, కొన్ని నెలలుగా ట్రంక్ రోడ్ విస్తరణ ముడిపడటం లేదు. నగర మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు విస్తరణకు ప్రతిపాదించడంతో వ్యాపారుల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. ఇదే క్రమంలో సుమారు 70 మంది వ్యాపారులు ఇటీవల కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రహదారి విస్తరణకు పాలకవర్గం ఆమోదం తెలియజేయనుంది. అలాగే బీఎస్‌హాలు రోడ్ విస్తరణ పనులు ఆమోదం తెలపనున్నారు.

రోడ్‌లు.. డ్రైన్‌లు.. పార్కులు.. గ్రీనరీ..

నగరంలోని పలు డివిజన్‌లలో కొత్తగా సీసీ రోడ్‌లు, మురుగునీరు పారుదల వ్యవస్థ మెరుగు కోసం కొత్తగా డ్రైన్‌లు, శ్మశాన వాటికల అభివృద్ధికి, పార్కులలో పచ్చదనం కోసం అవసరమైన పనులను అజెండాలో పొందుపరిచారు. వీటితోపాటు, ఒంగోలులో విలీనమైన గ్రామాలలో కూడా రోడ్‌లు, డ్రైన్‌లకు ప్రాధాన్యత కల్పించారు. ఇదిలా ఉండగా, నగరంలోని ప్రాంతాలలో రోడ్ విస్తరణ క్రమంలో సెంటర్ డివైడర్‌లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య నివారణపైనా దృష్టి సారించారు.

మునిసిపల్ షాపుల లీజులు..

కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు పెంపు కోసం మునిసిప్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీలలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో ఖాళీ ఉన్నషాపులను వేలంపాట ద్వారా కేటాయించనుండగా, అమరజీవి షాపింగ్ కాంప్లెక్స్ లీజు గడువు ముగిసినందున తిరిగి స్వాధీనం చేసుకుని మరల వేలం నిర్వహించనున్నారు. అలాగే ఊరచెరువులోని నిరుపయోగంగా ఉన్న స్లాటర్ హౌస్ ప్రస్తుతం శిథిలమైపోయి ఉండగా, తిరిగి బాగు చేసి, వినియోగంలోని తీసుకువచ్చేవిధంగా చర్యలు చేపట్టనున్నారు. కాగా పోతురాజు కాలువ పూడికతీత పనులు చేపట్టడంతోపాటు శివారు కాలనీల్లో అవసరమైన సీసీడ్రైన్‌లకు ప్రాధాన్యత ఇచ్చారు.

రైలులో మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత

విజయవాడ(రైల్వేస్టేషన్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) గురువారం ఒక ప్రయాణికుడు రైలులో మర్చిపోయిన బ్యాగ్‌ను ట్రేస్ చేసి తిరిగి అతనికి అప్పగించారు. గురువారం ఒంగోలుకు చెందిన రావిపాటి లక్ష్మీనారాయణ (68) బిట్రగుంట నుంచి విజయవాడ వచ్చే ప్యాసింజర్ రైలులో వస్తుండగా రైలు కృష్ణాకెనాల్ వద్ద కొంతసేపు ఆగింది. ఈ లోపల లక్ష్మీనారాయణ రైలు దిగి వాష్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి అతను వచ్చే లోగా సిగ్నల్ పడటంతో రైలు కదిలి వెళ్లిపోయింది. అతని బ్యాగ్ రైలులోనే ఉండిపోయింది. బ్యాగ్‌లో భూమికి సంబంధించిన విలువైన డాక్యుమెంట్లు ఉన్నందున ఆ సమాచారాన్ని విజయవాడ రైల్వే పోలీసు సీఐ రమణకు లక్ష్మీనారాయణ తెలియజేశాడు. సీఐ వెంటనే స్పందించి తన సిబ్బందిని రైలులో వెతికించారు. బ్యాగ్‌ను గుర్తించి లక్ష్మీనారాయణకు తిరిగి అప్పగించారు. విలువైన డాక్యుమెంట్లు లభించినందుకు లక్ష్మీనారాయణ జీఆర్‌పీకి కృతజ్ఞతలు తెలిపారు.

పొదిలిలో తాగునీటికి తిప్పలు

పొదిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మండల ప్రజల అవసరాల కోసం 45 ఏళ్ల కిందట దర్శి ఎన్‌పీ స్టోరేజీ ట్యాంక్ నుంచి పైపులైన్ వేశారు. ప్రస్తుతం పెరిగిన ప్రజలకు సరిపడా నీరు అందడం లేదు. రోజుల తరబడి నీటి సరఫరా కూడా బంద్ అవుతుందన్నారు. శివారు కాలనీల్లో నీటి సరఫరా దారుణంగా ఉంది. 15 రోజులుగా నీటి సరఫరా కాక పోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్‌లకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేయడంతో గురువారం ఎన్‌ఏపీ రక్షిత నీటి కోసం కొళాయిల వద్ద పెద్దఎత్తున ప్రజలు బారులుతీరారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

తాళ్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు అజిత్, కిరణ్, భూషణ్‌లు గురువారం పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు కిల్కారి కార్యక్రమం ద్వారా అందజేస్తున్న సేవలను వైద్యులు ప్రవీణకుమార్, రాజేష్‌యాదవ్‌లు బృందానికి వివరించారు. మాధవరం, తాళ్లూరు గ్రామాల్లో కిల్కారీ బృందం పర్యటించారు. గర్భిణులకు అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీఎం రాజేశ్వరి, కిల్కారి పీవో రాజు, సీహెచ్ఏ వి.రమణమ్మ, పీహెచ్ఎన్ వై.విజయమ్మ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ముండ్లమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి పెద జక్రయ్య తన ఇంటి ఆవరణలో ఉన్న మోటారును ఆన్ చేసేందుకు వెళ్లి షాక్‌కు గురై మృతి చెందారు. అతని మృతికి జూనియర్ లైన్‌మన్ కారణమని బంధువులు ఆరోపించటంతో ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ గురువారం కుటుంబసభ్యులను విచారించారు. తన తండ్రి మృతికి విద్యుత్ శాఖ సిబ్బందే కారణమని జక్రయ్య కుమారుడు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఎస్ఈతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని నాయక్ తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ అంకమ్మ, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి

దర్శి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించాలని ఎస్ ఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం దర్శిలో అధికారులు, సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. ఎక్కడైనా అక్రమ విద్యుత్ వాడకం జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ పి.శ్రీనివాసులు, డీఈఈ రవికుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు మంజూరుచేయాలి

పామూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ డి.రమేష్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డీపీఎం అంబేడ్కర్, సీఎస్‌పురం కెనరా బ్యాంక్ చీఫ్‌మేనేజర్ సంజయ్, పామూరు, సీఎస్‌పురం పశువైద్యాధికారులు ఆర్.హనుమాన్, షేక్ మునీర్, ఏపీఎం విద్యాసాగర్, మండల సమాఖ్య కార్యదర్శి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తి దేవస్థానంలో పూజలు


పామూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరగళదిన్నె గ్రామంలో వెలసిఉన్న దక్షిణమూర్తిస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, పామూరు మేజర్ పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

మాతృభూమిపై మమకారమే.. మృత్యుపాశమై

● నిత్యం సైకిల్‌పై 10 కి.మీ ప్రయాణించి కాలువలో స్నానం

● విధివక్రించి కొమ్మమూరులో మునిగి మృతి

● కారంచేడు గ్రామంలో విషాదం


హరిప్రసాద్ (ఫైల్)

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమీప పట్టణంలో నివసిస్తున్నా.. ఆ వృద్ధుడికి చిన్నతనం నుంచి పుట్టిపెరిగిన ఊరిపై మమకారం తగ్గలేదు. దీంతో నిత్యం 10 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ స్వగ్రామం వచ్చి ఊరిలోని కొమ్మమూరి కాలువలో స్నానం చేసి వెల్లడం ఆయన దినచర్యలో భాగమైంది. ఇలానే నిత్యం వస్తున్న ఆయన ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం కారంచేడులో చోటుచేసుకొంది.

గ్రామానికి చెందిన దగ్గుబాటి హరిప్రసాద్ (69) కొంతకాలంగా భార్యతో కలిసి చీరాలలో నివాసం ఉంటున్నారు. ప్రతిరోజూ సైకిల్‌పై 10 కిలోమీటర్లు చీరాల నుంచి కారంచేడు వచ్చేవాడు. కొమ్మమూరు కాలువలో స్నానంచేసి, గ్రామస్తులతో కొంతసేపు ముచ్చటించి తిరిగి చీరాల వెళ్లేవాడు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం చీరాల నుంచి కారంచేడు వచ్చాడు. రోజూ మాదిరిగానే కొమ్మమూరు కాలువలో స్నానానికి దిగాడు. అయితే ప్రమాదవశాత్తు నీటి ప్రవాహానికి కాలువలో కొట్టుకుపోయాడు. సమీపంలో ఉన్న వారు గుర్తించి విషయాన్ని గ్రామస్థుల ద్వారా పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి తెలియజేశారు. సమాచారం అందుకున్న ఎస్సై షేక్.ఖాదర్‌బాషా, తహసీల్దార్ జి.నాగరాజు హుటాహుటినా సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొన్నారు. స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లతో గాలిచారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో చీరాల ఫైర్ సిబ్బందిని ద్వారా కొమ్మమూరు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు మృతదేహం లభించింది. దీంతో కుటుంబ సభ్యుల సమక్షంలో పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆయన భార్య చీరాల్లో ఉంటుండగా, కుమార్తె, కుమారుడు ఉద్యోగ రీత్యా విదేశాల్లో ఉంటున్నారు. గ్రామానికి చెందిన వృద్ధుడు ఇలా కొమ్మమూరు కాలువలో కొట్టుకుపోయి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి నిత్యం వస్తూ తమను పలకరించే హరిప్రసాద్ మృతి చెందడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

21న అర్హత పరీక్ష

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ అర్హత పరీక్ష ఈనెల 21న స్థానిక గీతం డిగ్రీకాలేజీలో జరుగుతుందని కరస్పాండెంట్ నరసింహారావు తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు.

ప్రజలు తిరస్కరించినా..

వైసీపీ నేతలకు బుద్ధిరాలేదు!

▸▸ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మీ పాలన వద్దని ప్రజలు తిరస్కరించినా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. యూరియాపై అసత్య ప్రచారం చేస్తుందన్నారు. ఈప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం అధికారులు, దుకాణాల యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను అందించాలన్నారు. ఇటీవల యూరియాపై జరిగిన అసత్య ప్రచారాలతో రైతులకు అపోహలకు పోయి అవసరానికి మించి కొనేందుకు యత్నిస్తున్నారని ఎరువుల డీలర్లు ఎమెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా తమ ఇబ్బందులను వివరించారు. ఎరువుల డీలర్ల ఇబ్బందులను కూడా జడ్పీ సమావేశంలో చర్చించి తగిన న్యాయం చేస్తా మని చెప్పారు.

ప్రజాక్షేమం కోసం పరితపించటం అంటే మంత్రి నారా లోకేష్‌ను చూసి జగన్ నేర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అన్నారు. నేపాల్‌లో చిక్కుఉన్న తెలుగువారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు సచివాలయంలో ఉండి చర్యలు తీసుకున్నారన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వారితో వీడియోలో మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసి వారితో మాట్లాడుతూ ధైర్యం చెప్పారన్నారు. కేంద్రం అండతో వారిని సమన్వయ పరుచుకుంటూ నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించే ఏర్పాట్లు చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారికి ఎలాంటి ఆపద వచ్చినా నిలబడి పరిష్కరించే చంద్రబాబు తనయుడిగా మంచిపేరు తెచ్చుకుంటున్న లోకేష్‌ను చూసి జగన్ నేర్చుకోవాలన్నారు. అసత్య ప్రచారాలు మానుకుని మసులుకుంటే మంచిదన్నారు. సమావేశంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏడీఏ జైనులాబ్దిన్, తహసీల్దార్ రవిశంకర్, టీడీపీ నేతలు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), కొండా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

కనిగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం మరింత తో డ్పాటు నిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని గురువాజీపేట హైస్కూల్‌లో నూతనంగా భోజనశాల భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచేలా కృషి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో అన్నివసతులు

కనిగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయలను మధ్య దళారీలు లేకుండా నేరుగా వారే అమ్ముకునే వెసులుబాటు కల్పించేందుకు రైతుబజార్‌ను ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని తీగెలగొందిలో ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబజార్‌లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. త్వరలో ముఖ్యనేతలతో ప్రారంభించినున్నట్లు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న వ్యవసాయశాఖ గిడ్డంగిని పరిశీలించారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏడీఏ జైనులాబ్దిన్, తహసీల్దార్ రవిశంకర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొండాకృష్ణారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), తదితరులు పాల్గొన్నారు.

'నామ్'కేవాస్తే డ్రైనేజీ

- సైడ్ డ్రైన్లలో నిలుస్తున్న మురుగు
- దుర్వాసనతో దుకాణాలు మూసేస్తున్న వ్యాపారులు




అద్దంకి భవానిసెంటర్‌లో నామ్‌రోడ్డు వెంబడి నిలిచిన మురుగు, రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అద్దంకి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు వెంబడి నిర్మించిన సైడ్‌డ్రైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో మురుగు నీరు ప్రవహించే వీలు లేక దుర్వాసన వస్తోంది. నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో వర్షపు నీరు ప్రవహించే విధంగా మాత్రమే సైడ్‌డ్రైన్లు నిర్మించారు. అయితే మున్సిపాలిటీ అధికారులు ఆయా ప్రాంతాలలో ప్రత్యేకంగా సైడ్‌డ్రైన్లు నిర్మించకుండా నామ్ రోడ్డు వెంబడి ఉన్న కాలువల్లోనికే ఆయా ప్రాంతాల నుండి వచ్చే మురుగు నీరు కలిసే విధంగా చేశారు. అయితే నామ్ రోడ్డు వెంబడి ఉన్న సైడ్‌డ్రైన్‌లు అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు నీరు ప్రవహించడం లేదు. దీంతో రోడ్డు పైకి చేరుతుంది. ప్రధానంగా భవానిసెంటర్‌లో పలుదుకాణాలు, హోటళ్ల నుంచి వచ్చే మురుగు ముందుకు ప్రవహించ కుండా నిలచిపోతోంది. దీంతో దుర్వాసన తట్టుకోలేక ఆ ప్రాంతంలోని పలువురు షాపుల యజమానులు నాలుగురోజులుగా మూసేశారు. అసలే విషజ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో మురుగు నిలిచి ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుబృందానికి డ్రోన్ పంపిణీ



రైతులకు డ్రోనును అందజేస్తున్న నాయకులు

పంగులూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు గ్రామంలో శ్రీఆంజనేయడ్రోన్‌గ్రూపు రైతులకు గురువారం 80 శాతం రాయితీపై కిసాన్‌డ్రోన్ పంపిణీ చేశారు. ఈ డ్రోన్ పూర్తిఖరీదు రూ. 9.80లక్షలు కాగా రూ.7.80లక్షల రాయితీతో గ్రూపు సభ్యులైన రావుల సాంబశివరావు, రావుల రవిబాబు, ఏసోబు, అజయ్‌బాబు, వెంకటేశ్వర్లుకు వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చింతలసహదేవుడు డ్రోన్‌ను అందజేశారు. డ్రోన్ వినియోగంతో పంటసాగులో పురుగుమందు ఆదా అవుతుందన్నారు. తక్కువనీటి వినియోగంతో తక్కువ సమయంతో పైరుపై సరైన మోతాదులో పురుగు మందు పిచికారి చేయవచ్చన్నారు. తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్‌తో పాటు కంపెనీ డ్రోగో డ్రోన్ కంపెనీ ప్రతినిధి లీలా, నాయకులు రావుల వెంకటేశ్వర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షబీభత్సం



విద్యుత్ తీగలపై పడిన టవర్

బల్లికురవ, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం రాత్రి ఈదురు గాలులు భారీ వర్షం కురిసింది. కొమ్మినేనివారిపాలెం గ్రామ కూడలిలోని బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడిపోయింది. ఆ సమయంలో ప్రజలు ఎవరు బయట లేక పోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు ఉండడం వలన టవర్ నేలపై పడిపోకుండా అలానే ఉండిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. గురువారం పడిపోయిన టవర్‌ను బయటకు తీసి విద్యుత్ సరఫరాను ఇచ్చారు. అలానే పలు గ్రామాలో వరినారుమడుల సాగుకు సిద్ధమైన రైతులకు వర్షం వలన జాప్యం జరిగింది. ముక్తేశ్వరం గ్రామంలో వరి నారుమడుల్లోని విత్తనాలను వర్షంతో కుప్పకుప్పలుగా ఒక చోటకి చేరాయి. దీంతో మరోసారి నారు మడులు పెట్టాల్సిందే అని రైతులు అంటున్నారు. ఉక్కపోత ఎండలతో విలవిలలాడుతున్న ప్రజలకు భారీ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. సుబాబుల్, పత్తి, పంటలకు వర్షం కొంతమేర ఉపయోగం అని రైతులు పేర్కొంటున్నారు.



ముక్తేశ్వరంలో దెబ్బతిన్న నారుమడులు

స్వగ్రామానికి చేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లోకేష్ మృతదేహం

ఈ నెల 4న అమెరికాలో ప్రమాదవశాత్తు మృతి



లోకేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ప్రమాదవశాత్తు స్విమ్మింగ్‌ఫూల్‌లో పడి మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాటిబండ్ల లోకేష్ (28) మృతదేహం గురువారం ఉదయం మార్టూరుకు చేరింది. ఈ నెల 4న అమెరికాలో లోకేష్ మృతి చెందగా, తానా వారి సహకారంతో విమానంలో హైదరాబాదుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు వెళ్లి ప్రత్యేక అంబులెన్స్‌లో మార్టూరు చౌదరికాలనీలోని ఇంటికి తీసుకొచ్చారు. ఉన్నత చదువు కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లిన లోకేష్ మూడునెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాడు. అయితే న్యూయార్క్ సమీపంలోని బోస్టన్ రాష్ట్రంలో నివసిస్తున్న ఫ్లాట్ సమీపంలోని ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ ఫూల్‌లో పడి మృతిచెందాడు. .లోకేష్ మృతదేహం కోసం స్నేహితులు, కుటుంబసభ్యులు వారం రోజులు ఎదురు చూశారు. గురువారం మృతదేహం రాగానే అందరూ కన్నీటితో విషాదవదనంతో లోకేష్‌కు నివాళి అర్పించారు. అనంతరం పడమర బజారు సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

హరిహర గోశాలకు వరిగడ్డి, దాణా వితరణ



అద్దంకిటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని హరిహర గోశాలకు గురువారం దాతల సహకారంతో వరిగడ్డి, పశువుల దాణాకు నగదు అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు తెలిపారు. పసుమర్తిపాలేనికి చెందిన పసుమర్తి రామారావు మనుమరాలు బారసాల సందర్భంగా, చుండూరి మురళి సుధాకరరావు మిత్రులు, పలువురు రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో రూ.20 వేలతో గోశాలకు వరిగడ్డి, దాణాను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ ఆళహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్స్‌లో ఇంట్రాక్ట్ క్లబ్‌లు ఏర్పాటు

రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తిమ్మాయపాలెం, చక్రాయపాలెం జెడ్పీహెచ్ఎస్‌లు కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులతో ఇంట్రాక్ట్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రేమ, స్నేహం, సేవ, సమాజసేవలో భాగం పంచుకోవడానికి, విద్యా కార్యక్రమంలో భాగంగా ఇంట్రాక్ట్ క్లబ్‌లు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న హెచ్.ఎం.శ్రీనివాసరెడ్డి

చినగంజాం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి ఆటల పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు ఓటములు సహజమన్నారు. మండల స్థాయి ఆటలపోటీలలో మండల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా తదితర పోటీలను నిర్వహించారు. ఆటలలో ప్రతిభ సాటిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పర్చూరు నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ గంటా అంకమ్మ తెలిపారు. ఆటలపోటీలు శుక్రవారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ముంగర సురేష్‌బాబు, ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులతో గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పలు రకాల ఆటలపోటీలు నిర్వహించనున్నటు వారు తెలిపారు. 12వ తేదీన ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. 15వ తేదీన కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ సమావేశంలో ఎంఈవోలు కే.శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- డీఎస్సీ -2003 ఫోరం డిమాండ్



ఆర్ఐ శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డీఎస్సీ -2003 ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు తాలూకా కేంద్రమైన అద్దంకిలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్ఐ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు లేవి ప్రసాద్, ఐతా శ్రీనివాసరావు, ఈమని రజిత పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- డివిజనల్ నూతన అధ్యక్షుడు గోపీకృష్ణ



ఘన సత్కారం అందుకున్న నూతన కమిటీ

చీరాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని నూతన యూనిట్ కమిటీ అధ్యక్షులు గోపీకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఏపీఆర్ఎస్ఏ(ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) డివిజన్ యూనిట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా అధ్యక్షులుగా చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, సహాధ్యక్షులుగా వీవీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు పీవీ రాఘవరావు, శివశ్రీను, నారాయణమ్మ, కార్యదర్శిగా సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీగా భాగ్యరాజు, రమేష్, కృష్ణతేజ, కోశాధికారిగా శ్రీనివాసులు, ఈసీ మెంబర్స్‌గా సుజాత, జగదీష్, నిస్సీ దీవెన, డీసీ కౌన్సిల్ ప్రతినిధులుగా ఆదినారాయణ, సాయిరాం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా శివరామకృష్ణ, ఓంకార్‌లు వ్యవహరించారు. నూతన కమిటీ ప్రతినిధులను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళ్లు



ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

మార్టూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమ నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం మార్టూరులో సీపీఎం నాయకులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఎనికపాటి రాంబాబు, బోడెంపూడి సూరిబాబు, వీరవల్లి కృష్ణమూర్తి, ఎస్‌కే ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

- మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు సూచన



నిర్మాణంలో ఉన్న భోజనశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

చీరాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలోని భోజనశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. గురువారం కేజీఎం బాలికోన్నత పాఠశాలను చైర్మన్ పరిశీలించారు. చిన్నారులకు భోజనవసతి, తాగునీరు, మరుగుదొడ్లు, తదితరాలపై ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం వడ్డించి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఏఈ రవికుమార్, కౌన్సిలర్ రాములు పాల్గొన్నారు.

ఆడపిల్లను ఆనందంగా ఎదగనిద్దాం

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా ఆడపిల్లలను ఆనందంగా ఎదగనిద్దామని అసమానతలు లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని సీడీపీవో ఝాన్సీ పేర్కొన్నారు. గురువారం వేటపాలెం ప్రాజెక్టు కార్యాలయంలో 'మిషన్ శక్తి సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, లింగ వివక్షత తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. పీసీపీ ఎన్‌డీటీ చట్టం ప్రయోజనాలను వివరించారు. అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో మండల పరిధిలో పందిళ్లపల్లి ఆక్వాసాగు, కొత్తరెడ్డిపాలెం, రామచంద్రపురం ప్రాంతాల్లో సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకనటలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోత ఉంటుందన్నారు. పనులు అనంతరం యథావిధిగా సేవలు అందుతాయన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్‌కు గాయాలు

బల్లికురవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లాయపాలెం సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్ బైకుపై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మల్లాయపాలెం గ్రామానికి చెందిన నాగరాజు కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో బైకుతో సహా రోడ్డు మార్జిన్‌లో పడిపోయాడు. అటుగా వెళ్తున్నవారు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ప్రథమ చికిత్స అనంతరం నర్సరావుపేట ఆసుపత్రికి తరలించారు. నాగరాజు కాలుకు తీవ్రగాయమైంది.

మందుబాబులకు జరిమానా

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు పర్చూరు న్యాయస్థానం రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై టి.రత్నకుమారి తెలిపారు. బుధవారం రాత్రి నిందితులను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరు పరిచామన్నారు.

చట్టరీత్యా బాల్యవివాహాలు నేరం



బాలికలకు సూచనలు ఇస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ కన్వీనర్ రేణుక

పర్చూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని బాపట్ల జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కన్వీనర్ బి.రేణుక అన్నారు. గురువారం మండల కేంద్రమైన పర్చూరులోని శ్రీ శాతవాహనా హైస్కూల్‌లో 'బేటీ బచావో, బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బాలలపరిరక్షణ కమిటీ, అంగన్‌వాడీ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాతూ బాల్యంలోనే వివాహం చేయడం ద్వారా తల్లి, పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్ వైజర్ దీప్తీరాణి కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు బీరువా బహూకరణ



బీరువాను అందజేస్తున్న వెంకట్రావు

పంగులూరు ,సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల వెంకటరావు బీరువాను బహూకరించారు. పాఠశాల అవసరాల నిమిత్తం 12వేల విలువైన ఇనుప బీరువాను బత్తుల వెంకట్రావు గురువారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఐ.అనితకు అందజేశారు. తమ పాఠశాల అవసరాలను గుర్తించి విలువైన బీరువాను బహూకరించిన బత్తుల వెంకటరావుకు హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

మార్టూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ నిరసనవారం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ద్రోణాదుల జెడ్పీ హైస్కూల్‌లోని పలువురు ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.

ఉన్నత పాఠశాల పీడీకి నేతల ప్రశంసలు



పీడీని సన్మానిస్తున్న గ్రామస్థులు

పంగులూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు యోగాలో ఉత్తమ శిక్షణ ఇస్తూ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో చందలూరుకు గుర్తింపు తెచ్చిన ఉన్నత పాఠశాల పీడీ కొండా ప్రతిమను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు. యోగాపోటీలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామానికి, విద్యార్థులకు గుర్తింపు తెచ్చారన్నారు. ఈనెల 5 నుండి 7వ తేదీ వరకు ద్వారకా తిరుమలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో పాఠశాలకు చెందిన లిఖిత, శృతి ప్రథమస్థానంలో నిలిచారు. తద్వారా జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విశాఖలోప్రపంచ యోగాదినోత్సవంలో పాల్గొనే అవకాశం పాఠశాలకు లభించడంతో ఆమెను వారు ప్రశంసించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ పీడీగా గుర్తింపు పొందడాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గిరిజ, రామలింగస్వామి, వడ్లవల్లి వీరనారాయణ, అడ్డగడ సుబ్బయ్య, మురకొండ సుబ్బారావు, తాతయ్య, సతీష్, రామాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.